RNI TELTEL 2024/90138

# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక
తెలుగు





| హైదరాబాద్ ၊ మేడ్చల్ ၊ రంగారెడ్డి ၊ మహబూబాద్ ၊ కరీంనగర్ ၊ అదిలాబాద్ ၊ మెదక్ ၊ వరంగల్ ၊ ఖమ్మం ၊ నిజామాబాద్ ၊ నల్లగొండ ၊ భద్రాద్రి కొత్తగూడెం | ప్రధాన సంపాదకులు : కురిమిళ్ల చంద్రశేఖర్ గౌడ్ | శుక్రవారం 29 - మే - 2026 | సంపుటి : 05 | సంచిక : 0 70 | పేజీలు : 8 | వెల - 5 / |
|---|---|---|---|---|---|---|
| CIRCULATED IN HYDERABAD \| MEDCHAL MALKAJGIRI \| RANGAREDDY \|KHAMMAM \| KARIMNAGAR \| MAHABOOBNAGAR \| YADADRI BHUVANAGIRI \| NALGONDA \| NIZAMABAD \| WARANGAL \| MAHABUBABAD \| MEDAK \| ADILABAD \| RANGAREDDY | CHIEF EDITOR: KURIMILLA CHANDRA SHEKAR GOUD | Friday 29- 05 - 2026 | VALLUM - 05 | ISSUE 0 70 | PAGES - 8 | RS 5 / |


## అంతర్రాష్ట్ర జలవివాదాలు..

### కెన్-బెట్వా ప్రాజెక్టును ఉదహరించిన ప్రధాని మోదీ



జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని సూచన

సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా సమస్యలను అధిగమించాలన్న మోదీ

ఆయా రాష్ట్రాల్లోని రూ.30 వేల కోట్ల అభివృద్ధి పనులపై సమీక్ష

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు




- మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి జారీ
- జూన్ 2 నుంచి పంపిణీకి ఆర్టీసీ కసరత్తు
- ఇక ఆధార్ కార్డు అవసరం ఉండదు
- దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఈ నిర్ణయం
- తొలుత ప్రయోగాత్మకంగా ప్రతీ జిల్లాలో ఒక మండలంలో జారీ
- కార్డుల కోసం ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో కేంద్రాల సమాచారం

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి...

### కార్యక్రమానికి హాజరైన నందమూరి కుటుంబ సభ్యులు



- అమీర్‌పేట మైత్రివనం వద్ద విగ్రహావిష్కరణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, నందమూరి కుటుంబ సభ్యులు, మంచు మనోజ్
- కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎన్టీఆర్ అన్న రేవంత్ రెడ్డి

## మమతా బెనర్జీకి మరో భారీ షాక్..

### అధికార ప్రతినిధి శంతను సేన్ రాజీనామా

కకోలి దస్తీదార్ రాజీనామా చేసిన మరుసటి రోజే షాకిచ్చిన శంతను

ఆర్జీకర్ హత్యాచార కేసు, అవినీతి ఆరోపణలతో మనస్తాపం చెందినట్లు వెల్లడి



## మహారాష్ట్రలో హత్యకు గురైందనుకున్న యువతి...

### మధ్యప్రదేశ్ లో ప్రత్యక్షం!



## అది గొడ్డలి పార్టీ, మాది రాజ్యాంగాన్ని నమ్మిన పార్టీ:

టీడీపీ మహానాడులో అనిత ప్రసంగం

ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు

చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్న అనిత

20 ఏళ్లు టీడీపీ అధికారంలో ఉంటే ఏపీ ప్రపంచంలోనే నెంబర్ వన్





# గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ

సౌర విద్యుత్‌కు ప్రోత్సాహం - కల్లాల వద్దకు వచ్చి కట్టుకథలు చెప్పే బీజేపీ, బీఆర్ఎస్ నేతలను నిలదీయండి - డిప్యూటీ సీఎం భట్టి.. బోనకల్, గార్లపాడులో 2 సోలార్ యూనిట్లు ప్రారంభం



# ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం

- ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- తరుగు పేరిట రైతులకు తీవ్ర నష్టం
- విచ్ఛిన్నకర శక్తులకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఫైర్

ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉంటామన్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వారిని రోడ్డున పడేసిందని విమర్శించారు. 'రైతు గోస..బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాంచందర్‌రావు పరిశీలించి రైతులతో మాట్లాడారు. తరుగు పేరిట బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకు కోతపెడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని

సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక



# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి...

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యారా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.

# మమతా బెనర్జీకి మరో భారీ షాక్..

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ శంతను సేన్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. నిన్న కకోలీ దస్తీదార్ ఘోష్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఈ రాజీనామా మరుసటి రోజే శంతను సేన్ షాకిచ్చారు. 2024 నాటి ఆర్జీకర్ హత్యాచార కేసు, పార్టీపై వస్తున్న నిరంతర అవినీతి ఆరోపణలతో తాను తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని శంతను సేన్ పేర్కొన్నారు. పార్టీ అధికార ప్రతినిధిగా తన పాత్రను నిర్వర్తించే స్థితిలో లేనని తెలిపారు. వివిధ సమయాల్లో తాను పార్టీ నిర్ణయాలతో ఏకీభవించలేదని, అనేక వివాదాస్పద అంశాలపై తాను బహిరంగంగానే ప్రశ్నించానని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రజలు తనను వివిధ సందర్భాలలో ఎంతగానో ప్రశంసించారని పేర్కొన్నారు. ఆర్జీకర్ కేసు, నిరుద్యోగం, అవినీతి సహా వివిధ అంశాల కారణంగా ప్రజలు తమను ఓడించారని, అందుకే అధికార ప్రతినిధిగా మాట్లాడటానికి తన మనసు అంగీకరించడం లేదని పేర్కొన్నారు.

# మహారాష్ట్రలో హత్యకు గురైందనుకున్న యువతి...

**హత్యకు గురైందనుకున్న యువతి సజీవంగా ప్రత్యక్షం**

**ఆమె హత్య కేసులో తండ్రి, సోదరుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**గుర్తుతెలియని మృతదేహాన్ని ఆమెదిగా భావించి పొరపాటు**

**డీఎన్ఏ పరీక్ష చేయకుండానే కేసు నమోదు చేసిన వైనం**

**తన తండ్రి, సోదరుడు నిర్దోషులని యువతి వెల్లడి**

మహారాష్ట్రలోని జలగావ్ లో హత్యకు గురైందని భావించిన 26 ఏళ్ల శివాని అనే యువతి, మధ్యప్రదేశ్‌లో సజీవంగా కనిపించింది. ఆమె హత్య కేసులో అప్పటికే ఆమె తండ్రి, సోదరుడిని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఈ ఉదంతం కలకలం రేపింది. బుర్హాన్‌పూర్ ఎస్పీ అశుతోష్ బగ్రీ వెల్లడించిన వివరాల ప్రకారం, మే 1న శివాని, మే 9న అరుణ్ అనే యువకుడు కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు ఖక్నార్ పోలీస్ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో, మహారాష్ట్రలోని జలగావ్ పోలీసుల పరిధిలో తలలేని, పాక్షికంగా కాలిపోయిన ఓ యువతి మృతదేహం లభ్యమైంది. అది శివానీదేనని నిర్ధారించిన జలగావ్ పోలీసులు, హత్య కేసు నమోదు చేసి ఆమె తండ్రి బాపూరం కల్మేకర్, సోదరుడు అజయ్ కల్మేకర్‌లను అరెస్ట్ చేశారు. అయితే, అనూహ్యంగా శివాని... అరుణ్‌తో కలిసి బుర్హాన్‌పూర్ పోలీసుల ఎదుట హాజరవడంతో ఈ కేసు నాటకీయ మలుపు తిరిగింది. తన తండ్రి, సోదరుడు నిర్దోషులని, వారిని వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేసింది. “ఒకవైపు శివాని హత్య కేసు మహారాష్ట్రలో నమోదైతే, మరోవైపు ఆమె ఇక్కడ సజీవంగా ఉంది. ఇది విరుద్ధమైన పరిస్థితి“ అని ఎస్పీ బగ్రీ వ్యాఖ్యానించారు. మృతదేహానికి డీఎన్ఏ పరీక్ష చేయకుండానే పోలీసులు శివానిదిగా నిర్ధారించి, ఆమె కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. శివాని బయోమెట్రిక్స్ ద్వారా ఆమె గుర్తింపును నిర్ధారించుకున్నామని, ఈ విషయాన్ని జలగావ్ పోలీసులకు తెలిపి, యువతిని వారికి అప్పగించామని ఎస్పీ తెలిపారు. తదుపరి దర్యాప్తు జలగావ్ పోలీసులు కొనసాగిస్తారని ఆయన స్పష్టం చేశారు.

# అది గొడ్డలి పార్టీ, మాది రాజ్యాంగాన్ని నమ్మిన పార్టీ:

తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల పాలన విధ్వంసకరంగా సాగిందని, అది ప్రజావేదిక కూల్చివేతతో మొదలైందని ఆరోపించారు. ప్రత్యర్థి పార్టీని“గొడ్డలి పార్టీ“గా అభివర్ణించిన ఆమె, టీడీపీ రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీ అని స్పష్టం చేశారు. మహానాడు రెండో రోజు రాజకీయ తీర్మానాన్ని బలపరుస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి కోసం పోరాడిన మహిళలను బూటుకాళ్లతో తొక్కించారని, నారా లోకేష్ చేపట్టిన ‘యువగళం‘ పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారని అనిత ధ్వజమెత్తారు. దళితుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని మండలికి పంపిన నీచపు ఘనత ఆ పార్టీదేనని తీవ్రంగా విమర్శించారు. తాము గొడ్డళ్లు చేతికిచ్చే పార్టీ కాదని, యువనేత లోకేష్ రాజ్యాంగబద్ధమైన పాలన అందిస్తారని, ఆయన చేతిలో ఉన్నది ‘రెడ్ బుక్‘ అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అనిత అన్నారు. 2014లో నవ్యాంధ్రకు సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు, అమరావతి, పోలవరం పనులను పరుగులు పెట్టించారని గుర్తు చేశారు. రూ.200 ఉన్న పెన్షన్‌ను రూ.2000కు పెంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు. రానున్న 20 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగితే, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ మహానాడును మహిళలకు అంకితం చేసిన చంద్రబాబుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**గత పాలనలో విధ్వంసమే: సోమిరెడ్డి** తెలుగుదేశం పార్టీ మహానాడు-2026 రెండో రోజు సమావేశాలు వాడివేడిగా సాగాయి. మౌలిక సదుపాయాలు, దేవాలయాల పరిరక్షణపై ప్రవేశపెట్టిన తీర్మానాల సందర్భంగా టీడీపీ నేతలు గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. మౌలిక సదుపాయాలపై ప్రవేశపెట్టిన తీర్మానంపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. 2019-24 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రంలో కేవలం 1,800 కిలోమీటర్ల రోడ్లు మాత్రమే నిర్మించారని, తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 5,050 కిలోమీటర్ల రహదారులను నిర్మించిందని ఆయన పోల్చి చెప్పారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని రోడ్లలో 50 శాతం దెబ్బతిన్నాయని ఆరోపించారు. అమరావతి కోసం భూములిచ్చిన రైతులు 1,631 రోజుల పాటు ఉద్యమం చేశారని, ఈ పోరాటంలో 230 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. “మావిగన్“ పేరుతో వైసీపీ డ్రామాలు ఆడుతోందని, వారి గన్ కల్చర్ ఇంకా పోలేదని విమర్శించారు.

**‘గొడ్డలి పార్టీ’ పాలనలో దేవాలయాలు ధ్వంసమయ్యాయి: పనబాక లక్ష్మి** దేవాలయాల పరిరక్షణ తీర్మానంపై టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ప్రసంగించారు. ‘గొడ్డలి పార్టీ’ పాలనలో దేవాలయాలు ధ్వంసమయ్యాయని, తిరుపతి లడ్డూను అపవిత్రం చేశారని ఆమె ఆరోపించారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులను గత ప్రభుత్వంలోని నేతలు దోచుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అర్చకుల వేతనాలు, ధూప దీప నైవేద్యాల నిధులను పెంచిందని, వేద పండితులకు గౌరవ వేతనం అందిస్తోందని తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో దేశవ్యాప్తంగా 5,000 దేవాలయాల నిర్మాణం చేపట్టామని వివరించారు.

# అదనపు తహసీల్దార్లు

## లక్ష జనాభా దాటిన అర్బన్ మండలాలకు నియామకం




వేగంగా విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాలకు రెవెన్యూ సేవలను సమర్థవంతంగా అందించేందుకు వీలుగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లక్ష జనాభా దాటిన మండలాల్లో అదనపు తహసీల్దార్ పోస్టులను ఏర్పాటు చేస్తూ ప్రధాన భూపరిపాలన కమిషనర్ (సీసీఎల్ఏ) ఉత్తర్వులు జారీ చేశారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో మండలానికి ఉన్న ఒక తహసీల్దార్‌పై పని భారం పెరిగింది. ఫలితంగా భూ వివాదాలు, ఫిర్యాదులు, కోర్టు కేసులు, ప్రజాసేవల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అదనపు తహసీల్దార్ల నియామకానికి నిర్ణయం తీసుకుంది. భూభారతి దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల పనులు, ప్రజాపంపిణీ వ్యవస్థ పర్యవేక్షణ, వ్యవసాయ గణాంకాల నమోదు వంటి బాధ్యతలను తహసీల్దార్లు నిర్వహిస్తున్నారు. కొత్తగా నియమించే అదనపు తహసీల్దార్లకు సాగు నీటి వనరుల పరిశీలన, ఎన్నికల నిర్వహణ, కుల, ఆదాయ, స్థానిక నివాస ధ్రువపత్రాల జారీ, భూ ఆక్రమణల తొలగింపు, విపత్తు సహాయక చర్యలు, భూ సేకరణ కేసుల పర్యవేక్షణ వంటి బాధ్యతలను అప్పగించేలా జాబ్‌చార్ట్‌ను రూపొందించారు. మొత్తం నాలుగు జోన్ల పరిధిలో పలు పట్టణాలు, మండలాలకు అదనపు తహసీల్దార్ పోస్టులు మంజూరు చేశారు. వీటిలో మంచిర్యాల, మందమర్రి, పెద్దపల్లి, రామగుండం, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉత్తర, దక్షిణ మండలాలు, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, ఖిలా వరంగల్, పాల్వంచ, కాజీపేట్, హనుమకొండ, హసన్‌పర్తి, ఖమ్మం అర్బన్, మహబూబాబాద్ మొదలైనవి ఉన్నాయి. కొన్ని మండలాల్లో జనాభా రెండు లక్షలు దాటడంతో పరిపాలనా పరంగా వికేంద్రీకరణ అవసరం అయిందని అధికారులు చెప్పారు.

# ప్రస్తుత పరిస్థితుల్లో మన బాధ్యత ఏమిటి?

ఒక పక్క ముగింపు లేని రష్యాఉక్రెయిన్‌ల యుద్ధం, మరోపక్క ఏ మలుపు తిరుగుతుందో తెలియని ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం. ఈ పరిస్థితుల్లో రూపాయి విలువ దారుణంగా పడిపోయి నేడో, రేపో సెంచరీ కొట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం రూపాయి విలువ పడిపోవటం ఒక సహజ ప్రక్రియగా భావించిందే కానీ, దాని విలువ పెంచే ప్రయత్నం చేయలేదు. కొంతవరకు అటువంటి ప్రయత్నం చేసిన ఏకైక ప్రధాని పీవీ మాత్రమే. ఆయన ప్రధాని అయ్యే నాటికి దేశంలో విదేశీ మారక ద్రవ్యం అడుగంటిపోయి బంగారం తాకట్టు పెట్టే పరిస్థితి నెలకొన్నది. దీంతో పరిశ్రమల శాఖను తన దగ్గరే పెట్టుకొని ‘లైసెన్స్ రాజ్’ పద్ధతిని రద్దు చేసి పరిశ్రమలు బలపడేటట్టు చేశారు. దాని ఫలితాలు ఈ రోజున చూస్తున్నాం. రూపాయి విలువ పెరగటానికి ప్రభుత్వాలు ఏ ఆలోచనా చేయకపోవటం దురదృష్టం. డాలర్లతో కొనేవాటి మీద దృష్టి పెట్టి, ఆ డాలరు వాడకాన్ని తగ్గిస్తే రూపాయి బలపడుతుంది. మనం డాలర్లని ఎక్కువ ఖర్చు చేసేది పెట్రోలియం ఉత్పత్తుల కొనుగోలుకు. అది తగ్గాలంటే ప్రజా రవాణా పెరిగి కార్లు, మోటార్ సైకిళ్ళ వాడకం తగ్గాలి. హైదరాబాద్‌లో మెట్రో వచ్చి దశాబ్దమైనా సర్వీసులు పెరగలేదు, కొత్త లైన్లు ఏర్పాటు కాలేదు. ఎందుకు జరగలేదని మనం అడగం!ఇక రాజకీయ పార్టీల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. తెలంగాణ గత ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రధానమంత్రి హైదరాబాద్ వస్తే కనీసం కలిసేవారు కాదు. ఎన్నికలప్పుడు రాజకీయం చేయవచ్చు, కానీ ప్రతి నిమిషం అలాగే ఆలోచిస్తే అభివృద్ధి ఎలా జరుగుతుంది? ఇక ప్రధాన మంత్రిని చూస్తే మా పార్టీని గెలిపిస్తే, డబుల్ ఇంజన్ సర్కారు వస్తే అభివృద్ధి జరుగుతుందని అంటారు. అంటే వేరే పార్టీకి ఓటేస్తే సహాయం చేయం అని అర్థమా? ఇది న్యాయమా? ఇక కాంగ్రెస్‌కు అధికారం లేక పుష్కరం దాటింది. వస్తే ఆలోచిస్తామంటారే కానీ ఇది మేం చేస్తామనే క్లారిటీ లేదు. మన దగ్గర ఉన్న వనరులు, వాతావరణ పరిస్థితులు ప్రపంచంలో ఎక్కడా లేవు. ఈ రోజున ఒక కారు తయ్యారయ్యే ధర కంటే దాని మీద వేసే పన్నులే ఎక్కువ. కొన్ని పన్నులను తగ్గించుకొని పెట్రోల్ కారు ధరకు బ్యాటరీ కారు అమ్మగలిగితే, డాలర్లతో పెట్రోలియం ఉత్పత్తులను కొనే అవసరం తగ్గుతుంది. యుద్ధం మొదలై 70 రోజులవుతుంటే ఈ రోజు రెండు కార్ల కాన్వాయిలో వెళుతున్నాం, సైకిల్ మీద వెళుతున్నాం, మెట్రోలో వెళుతున్నామనే రాజకీయ నాయకులు.. శాశ్వతంగా ఇలాగే చేయవచ్చు కదా! ఇక గ్యాసు కొరత గురించి ప్రభుత్వం ఇప్పుడు బొగ్గు నుంచి గ్యాసు తయారు చేస్తే ఇన్ని వేల కోట్లు సబ్సిడీ ఇస్తామని ప్రకటన చూస్తే దప్పిక వేసినప్పుడు బావి తవ్వినట్లుంది. దానికి బదులుగా గ్రామాల్లో పంట కోసిన తర్వాత వచ్చే వ్యర్థాలతో తయారుచేసే బ్రిక్వెట్లు చేయించవచ్చు. వాటిని మండలానికి ఒకటి, రెండు ఏర్పాటు చేయిస్తే అక్కడి యువతకు ఉపాధి కలుగుతుంది. రైతులకు మిర్చి కట్టె, పత్తి కట్టె, కంది కట్టె లాంటి వ్యర్థాలను అమ్మటం వల్ల కొంత అదనపు ఆదాయం వస్తుంది. అంతేకాక వాటిని కాల్చినప్పుడు వచ్చే గ్రీన్ హౌస్ వాయువుల వల్ల పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. కమర్షియల్ గ్యాసు వాడే వారికి సగం ధరలో ఇవి లభించడంతో గ్యాసు కొనవలసిన అవసరం తగ్గుతుంది. దీనికి కావలసినది రాజకీయ చిత్తశుద్ధి. ఇంకొక ప్రధాన ఖర్చు పప్పు దినుసులు, నూనె కొనుగోళ్ళ . దీనికి ప్రభుత్వమే ఒక పాలసీ తయారు చేసి రైతులకు మంచి రేటు వచ్చేలా సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించాలి.ప్రభుత్వాలు ఆలోచించడానికి ధైర్యం చేయని ఒక విధానం ప్రతిదాన్నీ విదేశీ కంపెనీల నుంచి కొనే మన అలవాటు మార్చే ప్రయత్నం. కనీసం ప్రజలకు ఇలా చేయండి అని చెప్పే ధైర్యం ప్రభుత్వాలు చేయవు, చేస్తే బతకవు. మనకది తెలియదు, చెప్పవలసిన ప్రభుత్వాలు చెప్పవు. అదేమిటంటే ప్రతిదాన్నీ మనం విదేశీ కంపెనీల నుంచి కొంటాం, వాళ్ళు ఆ లాభాలను డాలర్లలో తరలిస్తారు. మన దగ్గర తయారు కానిదాన్ని విదేశీ కంపెనీల నుంచి కొంటున్నామంటే అర్థం ఉంది. కానీ మన దగ్గర నుంచి తీసిన నీటిని విదేశీ కంపెనీల నుంచి ఎందుకు కొనాలి? వాటిని శుభ్రం చేయటానికి లీటరుకు రూపాయి కూడా కాదు, బాటిల్ ఒక ఆరు రూపాయలైతే ఆ నీటిని ఇరవై రూపాయలు పెట్టి కొంటున్నాం, లాభాల్ని ఆ కంపెనీలు డాలర్ల రూపంలో విదేశాలకు తరలిస్తాయి, మనం ఆ డాలర్లను ఎక్కువ రేటుకు తిరిగి కొంటున్నాం. సబ్బులు, పేస్టులు, కూల్‌డ్రింకులు మొదలైనవి ఎందుకు విదేశీ కంపెనీల నుంచి కొనాలి? కోకోకోలా కంపెనీ ఆదాయం గడచిన సంవత్సరంలో 5,042 కోట్లు, పెప్సీ ఆదాయం 9,096 కోట్లు. ఇంకా సబ్బులు తయారు చేసే హిందుస్థాన్ లీవర్ ఆదాయం 16,351 కోట్లు. కాల్గేట్ ఆదాయం 6,548 కోట్లు. ఇలా అన్ని విదేశీ కంపెనీల ఆదాయాన్ని చూస్తే లక్ష కోట్లు దాటుతున్నాయి. వాటి మీద వచ్చే లాభాలను డాలర్లలో తీసుకుపోవటం వల్ల మన రూపాయి బలహీనపడుతున్నది. దీనికి ప్రభుత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితి, ఎందుకంటే ఇది మనలో నుంచి రావాలి. భారతదేశపు కంపెనీల ఉత్పత్తులు ప్రజలు వాడితే ఇక్కడి కంపెనీలు బలపడతాయి, రూపాయి విలువ పెరుగుతుంది. ఈ విదేశీ కంపెనీలకు వ్యతిరేకంగా ఏ ప్రభుత్వమైనా చర్యలకు యత్నిస్తే ఆ ప్రభుత్వాన్ని ఈ కంపెనీలు ఉండనీయవు. మన దేశపు రాజకీయ నాయకులు వాళ్ళ విరాళాలకు ఆశపడి వారికి భూములు, సౌకర్యాలు, సబ్సిడీలు కల్పిస్తారే కానీ, ప్రజలకు నిజాన్ని తెలియనివ్వరు. జరుగుతున్న దానిని ప్రజలు గమనించి, ప్రశ్నించిన రోజునే మన రూపాయి, మన దేశ ప్రతిష్ఠ బలపడుతుంది.




# గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ

మే 28: రాష్ట్రంలో సౌర విద్యుత్‌ను పెద్దఎత్తున ఉత్పత్తి చేసేందుకు ప్రోత్సాహం అందించడంతో పాటు రాష్ట్రాన్ని ‘గ్రీన్ ఎనర్జీ హబ్’గా మార్చేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిన్నబీవరల్లిలో ఓ ఇంటిపైన సోలార్ ప్యానల్‌ను, గార్లపాడులో ఓ పొలంలో సోలార్ పంపుసెట్‌ను ఆయన ప్రారంభించారు. ‘సోలార్ మోడల్ విలేజ్’లో భాగంగా వాటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విలేకరులతో మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్, పంపుసెట్లతో కరెంటు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపి అదనపు ఆదాయం పొందవచ్చని, ముందుకొచ్చినవారికి అందిస్తామని చెప్పారు. రెడ్కో సంస్థ రూపొందించిన ప్రత్యేక సోలార్ ప్యానళ్లను రైతులు షెడ్లుగా ఉపయోగించుకోవచ్చన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగినా కొరత లేకుండా చూడగలిగామన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించడం వల్ల పెద్దఎత్తున ధాన్యం, మొక్కజొన్నతో పాటు అన్ని పంటల దిగుబడి పెరిగిందని చెప్పారు. ధాన్యం, మొక్కజొన్న పంటల కొనుగోలుకు కేంద్రం కొర్రీలు, ఆంక్షలు పెడుతోందని విమర్శించారు. కేంద్రం సహకరించకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను కొంటుంటే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ స్వార్థం కోసం కల్లాల వద్దకు వచ్చి కట్టుకథలు చెబుతున్నారని భట్టి మండిపడ్డారు. అలాంటి వారిని రైతులు నిలదీయాలన్నారు. యాసంగిలో 51.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా ఇప్పటికే 57 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని చెప్పారు. ఈనెలాఖరుకు 75లక్షల మెట్రిక్ టన్నులు సేకరిస్తామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా కొనుగోలు చేయని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేస్తోందని చెప్పారు. మొక్కజొన్న కొనుగోలుకు ఆర్థిక శాఖ నుంచి రూ.5 వేల కోట్లు మంజూరు చేశామన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొంటున్నామని చెప్పారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం

పేర్కొన్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. రైతులకు బీజేపీ అండగా ఉంటుందని.. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసేవరకు పోరాటం చేస్తుందని చెప్పారు. కాగా, మహిళల హక్కుల కోసమే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని రాంచందర్‌రావు చెప్పారు. యూసీసీ ఒక కులానికో, మతానికో వ్యతిరేకం కాదని.. దానిద్వారా మహిళలకు, చిన్న పిల్లలకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులు లభిస్తాయని వివరించారు. గుజరాత్, ఉత్తరాఖండ్, గోవా, అసోం రాష్ట్రాలు ఇప్పటికే యూసీసీ చట్టాన్ని అమలు చేశాయని.. తెలంగాణలోనూ అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. రంగారెడ్డి ప్రొద్దుటూరులోని ప్రగతి రిసార్ట్సులో నిర్వహించిన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జిల్లా ప్రశిక్షణ శిబిరంలో రాంచందర్‌రావు మాట్లాడారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ(సర్) ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. విచ్ఛిన్నకర శక్తులకు మద్దతు ఇస్తున్నాయని ఆరోపించారు.

# మహాలక్ష్మికి స్మార్ట్ కార్డులు..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ప్రభుత్వ ప్రత్యేకంగా మహాలక్ష్మి స్మార్ట్ కార్డుల జారీ చేయనున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీలో విద్యార్థులకు రాయితీ, ఉద్యోగులకు, ఇతరులకు నెలవారీగా సీజన్ పాస్ అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మహాలక్ష్మిలకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇక నుంచి ఆధార్ కార్డుకు బదులు స్మార్ట్ కార్డు చూపించాల్సి ఉంటుంది.

**జూన్ 2 నుంచి జారీ** స్మార్ట్ కార్డులు వచ్చే నెల 2వ తేదీ నుంచి అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ సన్నాహక సమావేశం లో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎం.డి.నాగిరెడ్డి ఈ విషయమై సమీక్షించారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధుల కేటాయింపు ప్రతిపాదలను ఆర్థిక శాఖ మంత్రికి ఎం.డి. నాగిరెడ్డి వివరించడం తోపాటు స్మార్ట్ కార్డుల జారీకి సంబంధించిన వ్యయం గురించి వివరించారు. ఇందుకు ఆమోదం తెలుపడంతో తొలుత జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకొని, సాంకేతిక సమస్యలు పరిష్కరించుకొని జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై కసరత్తు జరుగుతోంది. స్మార్ట్ కార్డుకు సంబంధించిన విధివిధానాలు ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని అధికారులకు ఇంకా అందలేదు. త్వరలో సమాచారం అందే అవ కాశం ఉన్నట్టు చెబుతున్నారు.

**ఏటీఎం తరహాలో కార్డు** ఏటీఎం తరహాలో చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డు జారీ చేస్తారు. ముందుగా ఆధార్ కార్డు, ఒక ఫొటో సేకరించి మహాలక్ష్ముల ప్రాథమిక సమాచారం చిప్‌తో అనుసంధానిస్తారు. ఈ స్మార్ట్ కార్డులో లబ్ధిదారుడి పూర్తి వివరాలు, ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. తర్వాత వారి పేర్లతో కార్డు జారీ చేస్తారు. అమల్లోకి వచ్చాక స్మార్ట్‌కార్డు చూపకుంటే ఉచిత ప్రయాణానికి అనుమతివ్వరు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల పరిధిలో నెలకు సగటున 1.12కోట్ల మంది, ఏడాదికి 13.33 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు.

**దుర్వినియోగానికి చెక్** ఇతర రాష్ట్రాల వారు నకిలీ ఆధార్ కార్డులతో ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. బతుకు తెరువు కోసం పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన వేలాది మహిళా కూలీలు, ప్రైవేటు ఉద్యోగులు, నకిలీ ఆధార్ కార్డుల సాయంతో బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. దీని వల్ల ఆర్టీసీకి పెద్ద మొత్తంలో ఆదాయానికి గండి పడుతోంది. ఈ పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. కార్డుల జారీ దరఖాస్తు చేసుకునే విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవడానికి, సమీప కార్డుల జారీ కేంద్రాన్ని కనుగొనడానికి టీఆర్ఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమారాన్ని త్వరలో పొందుపరుస్తారు. కార్డులు అందే వరకు ఆధార్ కార్డు చూపించి మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు.

# అంతర్రాష్ట్ర జలవివాదాలు..

అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సూచన చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కెన్-బెట్వా ప్రాజెక్టు నమూనాను ఉదహరించారు. భారతదేశంలో మొట్టమొదటి నదుల అనుసంధాన ప్రాజెక్టు కెన్-బెట్వా ప్రాజెక్టు. మధ్యప్రదేశ్‌లోని కెన్ నదిలో ఉన్న అదనపు జలాలను కాలువ ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని బెట్వా నదికి మళ్లిస్తారు. ఈ నేపథ్యంలో మోదీ మాట్లాడుతూ, రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారానికి ఇది ఆదర్శ మోడల్‌గా పేర్కొన్నారు. ప్రధాని మోదీ కెన్ - బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం, ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0ను కూడా సమీక్షించారు. ఆయా నగరాల్లో రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలను అన్వేషించాలని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని ప్రధాని మోదీ సూచించారు.

## తెలంగాణలో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో రైతులు పంట నష్టపోయారు. పంట నీటిపాలు కావడంతో రైతులు ఆందోళన చెందారు. నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, కొమురంభీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వడ్లు, మక్కలు తడిసి ముద్దయ్యాయి. పలు ప్రాంతాల్లో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్, పెంబి మండలాలు, కొమురంభీమ్ జిల్లా కాగజ్ నగర్, కౌటాల మండలాల్లో అకాల వర్షాలతో ధాన్యం తడిసిముద్దయింది. ఇదిలా ఉండగా, పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

# ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట, భువనగిరి ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రులు పర్యటించారు.





**యాదగిరిగుట్ట మండల మే 28 సూర్య న్యూస్ :-** తెలంగాణ రాష్ట్ర మంత్రులు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ & సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యాదగిరిగుట్టలోని గోశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రుల బృందం వంగపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, బస్తాల తరలింపు, చెల్లింపుల విధానం వంటి అంశాలపై ఆరా తీశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని అధికారులకు సూచించారు. తదుపరి రమాజీపేట సమీపంలో ఏర్పాటు చేసిన గోదామును పరిశీలించారు. ఈ గోదామును ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా, మంత్రులు అక్కడ నిల్వ సామర్థ్యం, ధాన్యం భద్రత, నిర్వహణ విధానాలను పరిశీలించారు. గోదాములో ఎన్ని బస్తాలు నిల్వ చేయగలమనే వివరాలను అడిగి తెలుసుకొని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చర్యలను మంత్రులు ప్రశంసించారు. అనంతరం భువనగిరిలోని యాదాద్రి భువనగిరి

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితులు, నిల్వ సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు, రైతులకు చెల్లింపుల ప్రక్రియపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, రైతులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకుల పంపిణీ



**రామగిరి మే 28 సూర్య న్యూస్:-** సింగరేణి సంస్థ ఆర్జీ 3 ఏరియా ఓసీపి 2లో ఇపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న షాజీపాల్ తన పుట్టినరోజు సందర్భంగా రామగిరి మండలం కల్వచర్లలోలయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా షాజీ పాల్ మాట్లాడుతూ జీవితంలో మనం పొందినదానిలో కొంతైనా సమాజానికి తిరిగి ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత. నా పుట్టినరోజును సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. పేదవారికి సహాయం చేసే అవకాశం కల్పించిన లయన్స్ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ షాజీ పాల్ గతంలో ఆర్మీలో దేశ సేవ చేసి అనంతరం సింగరేణిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం గర్వకారణం. ఈ నెలలో సింగరేణి ఉద్యోగం నుండి విరమణ పొందుతున్న సందర్భంలో కూడా సమాజ సేవను మరవకుండా క్లబ్ అడ్మినిస్ట్రేటర్ మర్రి శరణ్య ద్వారా పేద కుటుంబానికి సహాయం చేయాలని ముందుకు రావడం అభినందనీయం. సేవా భావం ఉన్న వ్యక్తులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఎలెక్టెడ్ ప్రెసిడెంట్ డాక్టర్ శరణ్య యాదవ్, జోనల్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు, పెద్దపల్లి క్లబ్ ప్రధాన కార్యదర్శి మీసాల సత్యనారాయణ, క్లబ్ నూతన సభ్యురాలు పట్నం వసుంధర, వార్డు సభ్యురాలు చిట్టెంపెల్లి భాగ్యలక్ష్మి, కొట్టే స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐకేపీ కేంద్రాలను పరిశీలించిన సిఐ ఏ. మహేందర్

### ఐకేపీ సిబ్బందికి అవసరమైన నిర్దేశాలు జారీ



**హనుమకొండ టౌన్ మే 28 సూర్య న్యూస్:-** హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. మహేందర్ గురువారం రోజు ఐకేపీ సెంటర్, సిద్దాపూర్, అర్వపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు, సిబ్బందిని కలిసి మృదువైన ప్రక్రియ, సమయానుకూల చెల్లింపులు, నాణ్యతా తనిఖీలు, రైతుల సంక్షేమం కోసం మద్దతు వ్యవస్థల గురించి చర్చించారు. రైతుల సమస్యలను విని, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా సాగేలా అవసరమైన నిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి శ్రద్ధగా, బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు.

## జగన్ పీఏ కేఎన్‌ఆర్ నివాసంలో సిట్ తనిఖీలు

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఇందులో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్‌ఆర్) నివాసంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం తనిఖీలు చేపట్టింది. మద్యం లావాదేవీలకు సంబంధించి విజయవాడలోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు, సిట్ కార్యాలయంలో కేఎన్‌ఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆయనను ప్రశ్నిస్తున్నారు. బుధవారం కూడా కేఎన్‌ఆర్‌ను సిట్ అధికారులు దాదాపు 9.5 గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. విచారణలో ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. సిట్ దర్యాప్తులో కేఎన్‌ఆర్ ఆస్తులకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన భార్య శశికళ పేరిట తిరుపతి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు, ఆమె బ్యాంకు ఖాతాలో 2019-24 మధ్య సుమారు రూ. 19.86 కోట్లు జమ అయినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. వీటికి తోడు విజయవాడలో ఒక కార్ షోరూంలో వాటా, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఫ్లాట్లు, పలు జిల్లాల్లో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కేఎన్‌ఆర్, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనూహ్యంగా ఆస్తులు కూడబెట్టిన కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఒకవైపు విచారణ కొనసాగుతుండగానే, మరోవైపు నివాసంలో సోదాలు జరగడం ఈ కేసులో తీవ్రతను తెలియజేస్తోంది.

## ధాన్యం కొనుగోలు పై కలెక్టరేట్ లో రివ్యూ మీటింగ్

### జూన్ 4 లోపు దాన్యం కొనుగోలు చేయాలి- మంత్రులు

**హనుమకొండ టౌన్ మే 28 సూర్య న్యూస్:-** రాష్ట్ర నీటి పారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలసి గురువారం హన్మకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలు పై ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర ఫైనాన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు, హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, హన్మకొండ, వరంగల్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహాట్ బాజ్ పాయ్, డాక్టర్ సత్య శారద, బొర్ఖడే హేమంత్ సహదేవ్ రావు, సందీప్ కుమార్ ఝా, డిసిపి ధార కవిత అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. జూన్ 4వ తేదీ లోగా మొక్కజొన్న, వరి ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని మంత్రులు సూచించారు.




# బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు

### సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దు ఎస్పీ మహేష్ బి.గీతే



**వేములవాడ టౌన్ మే 28 సూర్య న్యూస్ :-** బక్రీద్ పండగ నేపథ్యంలో వేములవాడ పట్టణ పరిధిలోని ఓల్డ్ అర్బన్ కాలనీలో గల ఈద్గాని ప్రత్యక్షంగా సందర్శించి భద్రతపరమైన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగను అందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. జిల్లాలో ఉన్న ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ అవసరమైన అన్ని భద్రతా చర్యలను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ శాంతి, సామరస్యాల పరిరక్షణకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి చెక్ పోస్ట్ లో 24/7 వాహనాల తనిఖీలు చేపట్టి పశువుల అక్రమ రవాణా జరగకుండా విధులను నిర్వర్తిస్తున్నట్లు తెలియజేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల్లో విద్వేషాలను రెచ్చగొట్టే మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్.ఐ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎంపీడీవో కీలక సూచనలు.

### జూన్ 1లోపు పనులు పూర్తి చేస్తే ఫైనల్ బిల్లు మంజూరు.




**డోర్నకల్ ప్రతినిధి మే 28 సూర్య న్యూస్ :-** కురవి మండలం లోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కీలక సడలింపులు కల్పించినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద స్లాబ్ స్థాయి వరకు గృహ నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఫైనల్ బిల్లు మంజూరు చేయుటకు ప్రభుత్వం తాత్కాలిక రిలాక్సేషన్లు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం, ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో కాకపోయినా ఇంటి బయట వైపు ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేసి, వైట్ వాష్ లేదా వైట్ పెయింట్ వేయించి, మెయిన్ డోర్ అమర్చినట్లయితే ఫైనల్ బిల్లు మంజూరు చేయబడుతుందని తెలిపారు. అయితే ఈ ప్రత్యేక సడలింపులు 2026 జూన్ 1 తేదీ వరకు మాత్రమే అమలులో ఉంటాయని, జూన్ 2 తర్వాత ఫైనల్ బిల్లు పొందాలంటే ఇంటి నిర్మాణం పూర్తిస్థాయిలో అన్ని పనులతో సహా పూర్తి చేసి ఉండాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మండలంలోని సంబంధిత లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, జూన్ 1లోపు ఇంటి బయట ప్లాస్టరింగ్, వైట్ పెయింట్, మెయిన్ డోర్ అమరిక వంటి పనులు పూర్తి చేసి, కొత్త నిబంధనల ప్రకారం గృహ నిర్మాణాన్ని పూర్తి చేసి ఫైనల్ బిల్లు పొందాలని ఎంపీడీవో సూచించారు. అలాగే ఈ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి ఫైనల్ బిల్లు మంజూరు పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

# కామారెడ్డి జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల వారోత్సవాలు

**కామారెడ్డి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్ :-** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెప్మా, సెర్ప్ ఆద్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలలో భాగంగా బాన్సువాడ పట్టణం, గ్రామీణ మండలంలో గల గ్రామ సంఘాల, వార్డు సంఘాల అధ్యక్షులు, విఓఏ లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు. ఈ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లాలోనే రెండు మండలాలకు దోమకొండ, బాన్సువాడ మండలాలకు మంజూరు అయిన మండల మహిళా సమాఖ్య సాముదాయక నిర్వహణ శిక్షణా కేంద్రాల్లో , బాన్సువాడ మండలానికి మంజూరు చేయబడిన మండల మహిళా సమాఖ్య సాముదాయక నిర్వహణ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం, బాన్సువాడ మండల సమాఖ్య 52 మహిళా సంఘాలకు రూ.6 కోట్ల 13 లక్షల చెక్కును మహిళా సంఘాల అధ్యక్షులకు, ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పి ఏం ఎస్ ఏం ఏ ) పథకం కింద 15 మంది లబ్ధిదారులకు మంజూరు అవగా, నలుగురు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి. మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కాసుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 మహిళా సంఘాలకు గాను రూ.2 కోట్ల చెక్కును, బాన్సువాడ పట్టణంలో 18 సంవత్సరాలు పైబడిన అర్హత కలిగిన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు , ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు కామారెడ్డి మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, ఎపీడీ విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ హయ్యూమ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సూర్య

శుక్రవారం 29 - 05 -2026

# ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం





**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం**

**ధాన్యం రవాణాకు ఇసుక లారీలను ఏర్పాటు చేయండి**

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి**

**రైతులు పక్షానే ప్రభుత్వం**

**జిల్లాలో ఇప్పటివరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు**

**రెవెన్యూ సివిల్ సప్లై పోలీస్ శాఖ సమన్వయంతో ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్

రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర నీటి పారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు పై ఏర్పాటు చేసిన సమావేశానికి రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి ఈ పర్యటనలు సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, ఎలాంటి ఆర్థిక పరిస్థితులు ఎదురైనా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే రైతులు అస్సలు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.రైతులకు నష్టం జరగనివ్వమని మంత్రి తెలిపారు.రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. నాలుగు, ఐదు రోజులు పాటు ఇసుక వాహనాలను పంట కొనుగోలు కోసం, అన్లోడింగ్ కోసం ఉపయోగించుకోవాలని తెలిపారు. యాసంగి పంట రికార్డ్ స్థాయిలో వచ్చిందని ,వరి ధాన్యం, జాగ్రత్తలు పాటిస్తూ ధాన్యమును గోడౌన్లకు తరలించాలన్నారు. రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సారి వరి ధాన్యం అద్భుతమైన పంటలు పండాయని, రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయటం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. మద్దతు ధర ప్రకటించిన ప్రకారం రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తూ అత్యధిక మొత్తంలో డబ్బులు జమ చేయడం జరిగిందని అన్నారు. తడచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఐ టీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఈసారి వరి ధాన్యం ఎక్కువ దిగుబడి వచ్చిందని, రైతుల పక్షాన ప్రభుత్వం ఉందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది.జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి,జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ జిల్లా పౌర సరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి,మండల తాసిల్దార్లు, యం పి ఓ లు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# శాస్త్రీయ ఆలోచనతోనే కార్మిక వర్గ విముక్తి సాధ్యం






**సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ**

**సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులకు శిక్షణ**

**కార్మికులు రాజకీయంగా సామాజికంగా చైతన్యం కావాలి**

**పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోవడానికి ప్రతి ఒక్కరికి శాస్త్రీయ ఆలోచన అవసరం**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్

సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తూ, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకున్నప్పుడే కార్మిక వర్గ విముక్తి, హక్కుల సాధన సాధ్యమవుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ కార్మికులకు పిలుపునిచ్చారు.

గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు.ఈ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ శాస్త్రీయ ఆలోచన అనే అంశంపై ఆమె కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ గమనాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీని అర్థం చేసుకోవడానికి ప్రతి ఒక్కరికీ శాస్త్రీయ ఆలోచన అవసరమని పేర్కొన్నారు. మూఢనమ్మకాలు, పాతకాలపు ఆలోచనలు కార్మిక వర్గాన్ని వెనక్కి నెడుతుంటే, శాస్త్రీయ దృక్పథం వారిని చైతన్యవంతులను చేస్తుంద న్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటే కార్మికులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పోరాటాలు చేసే కార్మిక నాయకులకు, కార్యకర్తలకు ఇటువంటి శిక్షణా తరగతులు సైద్ధాంతిక బలాన్ని ఇస్తాయని, భవిష్యత్తు ఉద్యమాలకు దిక్సూచిగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్లాసుల ప్రారంభానికి ముందుగా సీఐటీయూ జెండాను జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి ఆవిష్కరించారు.ఈ శిక్షణా తరగతులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం ప్రిన్సిపాల్ గా వ్యవహ రించారు.ఈ క్లాసులో సీఐటీయూ జిల్లా ఆఫీస్ బేరర్స్ దాసరి పాండు, మాయ కృష్ణ, తుర్కపల్లి సురేందర్, గొరిగే సోములు, సిలివేరు రామకుమారి,పొట్ట యాదమ్మ, నకిరేకంటి రాము, పైళ్ల గణపతి రెడ్డి జిల్లా కమిటి సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, గంధమల్ల మాతయ్య,కసగొని లలిత, పోతరాజు జహంగీర్, మంచాల మధు , అప్పం సురేందర్,డానియల్,మారయ్య,నాయకులు గణేష్ ,సిద్ధులు, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరిలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ**

**ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు**

**తెలిపిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్

భువనగిరి పట్టణం లోని హైదరాబాద్ చౌరస్తా నూతన ఈద్గా వద్ద ముస్లిం సోదరులు గురువారం బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రతి ఒక్కరికి బక్రీద్ పండగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ త్యాగనికి ప్రతీక గా ప్రతి ఒక్కరు ఈ పండుగ చేసుకొంటారు అని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాంగేళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, అంజుమన్ కమిటీ అధ్యక్షులు ఎంఏ. రహీమ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, మున్సిపల్ కౌన్సిలర్ లు,మాజీ మున్సిపల్ చైర్మన్ లు తదితరులు పాల్గున్నారు.



## ఏరియా సర్వే అధికారిగా అఫ్సర్ పాషా




రామగిరి మే 28 సూర్య న్యూస్:- సింగరేణి సంస్థ ఆర్జీ3 ఏరియా(ఆర్జీ3, అడ్రియాలా (ప్రాజెక్ట్స్ ఏరియా) సర్వే అధికారిగా ఎండి. అఫ్సర్ పాషా గురువారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏరియా అధికారిగా విధులు నిర్వహించిన డి. జనార్ధన రెడ్డి ఏప్రిల్ చివరిలో పదవీ విరమణ పొందగా ఓసీపి 1 సర్వే అధికారి కె. ఫణీంద్ర అదనపు ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జీడీకే 10ఏ ఇంక్లైన్ గని, ఓసీపీ 1లో విస్తృత అనుభవం ఉన్న అఫ్సర్ పాషా ప్రస్తుతం బెల్లంపల్లి ఏరియా సర్వే అధికారిగా ఉన్నారు. ఈ నెల 15న జారీ అయిన బదిలీ ఉత్తర్వుల మేరకు ఆయన ఆర్జీ3కి వచ్చారు. పూర్వపు అనుభవంతో సిబ్బందికి సుపరిచితులైన అఫ్సర్ పాషాకు ఆర్జీ3 సిబ్బంది, అధికారులు హృదయపూర్వక స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

**కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్**

**తడిసిన ధాన్యం పరిశీలన**

**రైతులకు ధైర్యం కల్పించిన కలెక్టర్**

**బుధవారం 411 మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యం కొనుగోలు**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడవద్దని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. రబీ 2025-26 వరిధాన్య కొనుగోళ్లలో భాగంగా, జిల్లా కలెక్టరు వర్షాలకు ప్రభావితమైన వరిధాన్య కొనుగోలు కేంద్రాలను గురువారం సందర్శించారు. తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి, ఇతర పీపీసీ కేంద్రాలకు వెళ్ళి, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, సదరు రైతులతో మాట్లాడి, తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తామని, ఎటువంటి ఆందోళన చెందవద్దని రైతులకు తెలిపారు. భవిష్యత్తులో ధాన్యం తడిచినచో, ఆ ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రైతుల వద్దనుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టరు, జిల్లా స్థాయి అధికారులు డి సి ఓ, డి ఆర్ డి ఓ, డి సి ఎస్ ఓ, డీఎంసీఎస్సీ, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవో లు వరిధాన్య కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు. బుధవారం 411 మెట్రిక్ టన్నుల తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, బాయిల్డ్ మిల్లులకు తరలించటం జరిగిందని జిల్లా కలెక్టరు తెలిపారు.

## భువనగిరిలో ఘనంగా వీర సావర్కర్ జయంతి వేడుకలు



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్ భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వీర సావర్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఐలయ్య, వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులు, నవభారత్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరకడ కరుణ్, వాస సాయి చరణ్, సాయి, సునీల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. వీర సావర్కర్ దేశభక్తి, క్రమశిక్షణ, యువతలో సేవాభావం వంటి విలువలను గుర్తు చేసుకుంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. యువత సమాజ సేవలో ముందుండాలని, దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## కాకునూరి మహేందర్ ను సన్మానించిన కుంభం



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకునూరి మహేందర్ కి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పార్టీ కొసం పని చేసే ప్రతి కార్యకర్త కు గుర్తింపు పార్టీ లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తాంగెళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటశ్వర్ల, కూర వెంకటేష్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, జాలిగాం వేగ్నేష్, బాబు రావు, నర్సింహా, యాదగిరి, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్‌పై అసత్య ఆరోపణలు.

## సీరోల్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ పిటీషన్ దాఖలు. ప్రజా నాయకుడిపై దుష్ప్రచారం తగదన్న కాంగ్రెస్ నేతలు.

**డోర్నకల్ ప్రతినిధి మే 28 సూర్య న్యూస్ :-** డోర్నకల్ ఎమ్మెల్యే, డాక్టర్ రామచంద్ర నాయక్‌పై అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీరోల్ పోలీస్ స్టేషన్‌లో పిటీషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. డోర్నకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు తీసుకెళ్తున్న నిష్కళంక నాయకుడిపై కావాలనే దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ కృషి చేస్తున్నారని కొనియాడారు.

సామాన్య కార్యకర్తలకు అండగా నిలుస్తూ సీఎం రిలీఫ్ ఫండ్, ఎన్ఓసీల మంజూరులో పార్టీలకు అతీతంగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక సీఎం రిలీఫ్ చెక్కులు డోర్నకల్ నియోజకవర్గం నుంచే అందించిన నాయకుడు రామచంద్ర నాయక్ అని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా, బెల్లం దందాపై పోరాడుతూ ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం పనిచేస్తున్నారని, “బొకేలు వద్దు పుస్తకాలు ముద్దు” అనే సందేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారని నాయకులు పేర్కొన్నారు. అలాంటి ప్రజా ఆపద్బాంధవుడిపై రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు బోడ రమేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జెరిపోతుల మహేష్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మలికంటి సురేష్, కాంపల్లి సర్పంచ్ రేపాల ఎల్లమ్మ, ఉప సర్పంచ్ మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గంద్ర సత్యం, భూక్య బీంసాగర్, కన్నం రాంబాబు, బండి మల్లయ్యతో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.




# యువజన విద్య రంగాల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం - కల్లూరి ధర్మేంద్ర

## ఉద్యోగాలు, విద్య, భవిష్యత్తు కోసం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు
## విద్యను కార్పోరేట్ చేతుల్లోకి నెట్టివేస్తున్న ప్రభుత్వాలు
## ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి మోసం చేసిన బిజెపి
## ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఉద్యోగాలు లేకుండా చేస్తున్న కేంద్రం
## నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని బలహీన పరుస్తున్న పాలకులు
## ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో వసతులు కరువు


**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్** దేశ భవిష్యత్తు అయిన యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని,ఒకవైపు నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతుండగా, మరోవైపు విద్యను కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి నెట్టివేస్తూ సామాన్య విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని, యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్న పాలకుల వైఖరిని అఖిల భారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్ ) తీవ్రంగా ఖండిస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి సమావేశం భువనగిరి లోని సీపీఐ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి యువతను మోసం చేసిందన్నారు . ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఉద్యోగ అవకాశాలను కుదిస్తోందన్నారు . రైల్వేలు, బ్యాంకులు, రక్షణ రంగం, విద్యుత్ రంగాల్లో ఖాళీలను భర్తీ చేయకుండా కాంట్రాక్ట్ విధానాన్ని ప్రోత్సహిస్తోందని, ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాలలో ఆలస్యం, పరీక్షల రద్దులు యువతలో తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయని విమర్శించారు. ఇక విద్యారంగంలో నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తూ, పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారన్నారు . ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి, ఫీజుల పెంపు వంటి సమస్యలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు . రాష్ట్ర ప్రభుత్వం కూడా యువజన విద్య సమస్యల పరిష్కారంలో స్పష్టమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు . ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని, ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ యువతకు గౌరవప్రదమైన ఉపాధి కల్పించాలని,

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

అనంతరం సీపీఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, పాలకులు నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు, విద్యార్థి హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో యువత తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు . ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆ దిశగా సరైన ప్రణాళికలు కనిపించడం లేదన్నారు .ఈ పరిస్థితుల్లో యువత భవిష్యత్తును కాపాడేందుకు ఏఐవైఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ. నయీమ్, జిల్లా సమితి సభ్యులు నర్సింహా చారి, శోభన్ బాబు, ఆనంతుల నర్సింహా, కంబాల రాజు, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.




# త్యాగానికి ప్రతీకగా నిలిచేది బక్రీద్



**చంద్రుగొండ మే 29 సూర్య న్యూస్ :** పండుగను మండల ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకున్నారు. చంద్రుగొండ, తిప్పనపల్లి, మహ్మద్ నగర్, గ్రామాల్లో ఉదయాన్నే మసీదులకు, ఈద్గాలకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు (నమాజ్) నిర్వహించారు. మత గురువులు (ఇమామ్‌లు) ప్రత్యేక ప్రార్థనలు చేయించి, పండుగ విశిష్టతను, ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని వివరించారు. హిందూ ముస్లిములు శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక దువా చేశారు. పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా మత సామరస్యం ఉట్టిపడింది. ముస్లిం సోదరులకు హిందూ బంధువులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. నమాజ్ పూర్తయిన తర్వాత ముస్లింలు తమ ఇళ్లలో సాంప్రదాయబద్ధంగా ఖుర్బానీ ఇచ్చి ఆ మాంసాన్ని మూడు భాగాలుగా చేసి బంధువులకు, మిత్రులకు, పేదలకు పంపిణీ చేశారు.

## యూత్ ను మాయ చేస్తున్న మమితా బైజు!

వెండితెరకి కథానాయికగా పరిచయం కావడం .. సక్సెస్ గ్రాఫ్ పెంచుకుంటూ వెళ్లడం .. స్టార్ హీరోల సరసన అవకాశాలను అందుకోవడం .. అంత తేలికగా జరిగిపోయే పనులేం కాదు. అందుకు తగిన ప్రతిభ ఉండాలి .. ఆ ప్రతిభకు తగిన అవకాశాలు .. గుర్తింపు రావాలి. వాటన్నింటినీ చాలా ఓపికగా సంపాదించుకుంటూ వచ్చిన బ్యూటీగా మమితా బైజు గురించి చెప్పుకోవాలి. ప్రస్తుతం తమిళ .. మలయాళ సినిమాలతో ఆమె చాలా బిజీ.

# మహిళల డబ్బులు అపహరించిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్.

**మహబూబాబాద్ టౌన్ పోలీసుల చాకచక్యంతో ముగ్గురు మహిళా నిందితులు అదుపులో.**

**సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన పోలీసులు.**

**డోర్నకల్ ప్రతినిధి మే 28 సూర్య న్యూస్ :-** మహబూబాబాద్ పట్టణంలో బ్యాంకుల వద్ద, బస్టాండ్ ప్రాంతాల్లో మహిళల దృష్టి మళ్లించి నగదు అపహరిస్తున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాను టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకుని, అపహరించిన నగదును స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ టౌన్ డీఎస్పీ నంబూరి తిరుపతి రావు తెలిపారు.డీఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక గిరిప్రసాద్ నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ ఈ నెల 25న నెహ్రూ సెంటర్‌లోని టీజీవీబీ బ్యాంకు నుంచి రూ.46 వేల నగదు డ్రా చేసుకుని అనంతరం ఇండియన్ బ్యాంకులో తన ఖాతా వివరాలు తెలుసుకునేందుకు లైన్లో నిలబడి ఉండగా, నలుగురు మహిళలు ఆమె చుట్టూ తిరుగుతూ దృష్టి మళ్లించి నగదును అపహరించి పరారయ్యారు.అదేవిధంగా ఈ నెల 23న స్థానిక బస్టాండ్‌లో ఇల్లందు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న మరో మహిళ పర్సులోని రూ.5 వేల నగదును కూడా ఇదే ముఠా దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన టౌన్ పోలీసులు, సీసీటీవీ ఫుటేజ్,సాంకేతిక ఆధారాల సహాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తాడేపల్లిగూడెం సమీప యాగర్లపల్లిపుంత గ్రామానికి చెందిన పాట్నాల పోలమ్మ, యారసాని స్నేహ, మన్నవ సుబ్బలక్ష్మి అనే ముగ్గురు మహిళలను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. మరో నిందితురాలు వరలక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి అపహరించిన నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేసు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఎస్ఐలు ఉమ, వెంకటేశ్వర్లు మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.




# కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం.



**అశ్వాపురం మే 28 సూర్య న్యూస్:-** మల్లెలమడుగు గ్రామంలోని మల్లికార్జునస్వామి సమీపంలో 25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు పనులను గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, నిర్మాణ పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడే విధంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మల్లెలమడుగు సర్పంచ్ మచ్చా నరసింహారావు, ఆవుల రవి, బారాసు సంపత్, బేతం రామకృష్ణ, సామకూరి వెంకన్న, బచ్చు వెంకటరమణ, బూ రెడ్డి వెంకటరెడ్డి , తుక్కాని మధుసూదన్ రెడ్డి , సర్వకృష్ణ, చుంచు ఏకాంబరం, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొండికుంటలో శ్రీ వెంకటేశ్వర క్వాలిటీ ఫ్యూయల్స్ బంకును ప్రారంభించిన ఎమ్మెల్యే



**అశ్వాపురం మే 28 సూర్య న్యూస్ :-** మండల పరిధిలోని మొండికుంటలో మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర క్వాలిటీ ఫ్యూయల్స్ బంకును( బిపిసిఎల్ ) గురువారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందుబాటులోకి రావడంతో పరిసర ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వాణిజ్య సంస్థలు ఏర్పడడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మొండికుంట సర్పంచ్ మద్రి సంధ్య, మల్లెలమడుగు సర్పంచ్ మచ్చా నరసింహారావు, ఆవుల రవి, బారాసు సంపత్, బేతం రామకృష్ణ, సామకూరి వెంకన్న, బచ్చు వెంకటరమణ, బూ రెడ్డి వెంకటరెడ్డి , తుక్కాని మధుసూధన్ రెడ్డి , సర్వకృష్ణ, చుంచు ఏకాంబరం, కార్యకర్తలు గ్రామప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి సీఎండీకి ఐఎన్టీయూసీ ఘనస్వాగతం

**కార్మిక సమస్యలపై వినతి**



**రామగిరి మే 28 సూర్య న్యూస్:-** సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి గురువారం ఆర్జీ2 ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్జీ3 ఏరియా పరిధిలోని ఓసీపి1 ఐఎన్టీయూసీ శాఖ ఆధ్వర్యంలో ఆ సంఘం కేంద్ర కమిటీ కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ నేతృత్వంలో సీఎండీకి ఘనస్వాగతం పలికారు. గడ్డం తిరుపతి యాదవ్ సీఎండీకి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఓసీపీ 1, కంపెనీలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరిస్తూ సీఎండీకి వినతిపత్రం అందజేశారు. సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి స్పందిస్తూ తిరుపతి యాదవ్‌ను శాలువాతో సన్మానించి కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ 1 పిట్ కార్యదర్శి తోకల ప్రవీణ్ రెడ్డి, ఎం. ప్రభాకర్ రెడ్డి, రాజన్న, ఎం. నరేష్ కుమార్, కిషన్ నాయక్, సదానందం, వెంకట్రాజం తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతలు..

వేసవి వేడిని తట్టుకోవడంలో ప్రజలకు సహాయపడే ప్రయత్నంలో భాగంగా, ఢిల్లీ ప్రభుత్వం నగరంలో సౌరశక్తితో నడిచే ఒక పబ్లిక్ కూలింగ్ స్ట్రక్చర్‌ను పైలట్ ప్రాతిపదికన ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. దీనిని షాలిమార్‌బాగ్‌లో అభివృద్ధి చేస్తున్నారు. ఇది జూన్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. దేశ రాజధానిలో ఎండలు మండిపోతున్నాయి. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఎండలకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం సోలార్ హట్స్ ఏర్పాటు చేయాలనే ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, చల్లదనాన్ని అందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి అన్నివైపులా గడ్డిని ఏర్పాటు చేస్తారు. స్ప్రింక్లర్ సిస్టమ్ కూడా ఉండటం వల్ల లోపల అంతా చల్లదనం పరుచుకుంటుంది. ప్రజలకు దీనివల్ల నీడతోపాటు చల్లదనం లభిస్తుంది.

## ఆరోగ్య, ఆర్థిక భద్రతకై అర్హులైన ప్రతీఒక్కరూ సీఎంఆర్ఎఫ్ ను వినియోగం చేసుకోవాలి



**కుత్బుల్లాపూర్ మే 28 సూర్య న్యూస్ :-** అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుడికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన ఎల్ఓసీ పత్రాలను చింతల్ లోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లబ్ధిదారులకు అందజేశారు. ఎల్వోసీ పత్రాల అందజేతలో భాగంగా సిఎంసీ సూరారం డివిజన్ నెహ్రూ నగర్ కి చెందిన కొండవీటి అన్నమ్మ భర్త కె.మంతెనయ్య రూ. 75,000 మంజూరు కాగా, సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన నూకారపు సూర్యనారాయణ తండ్రి ఎన్. రామి నాయుడు కు రూ. 1,50,000 మంజూరు కాగా ఆయా డివిజన్లకు చెందిన నాయకులు లబ్ధిదారుల కుటుంబసభ్యులకు ఎల్వోసీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్య నారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, నాయకులు బలరాం రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ మే 28 సూర్య న్యూస్ :-** ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఐడిపిఎల్ చౌరస్తా వద్ద ఉన్నటువంటి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఖ్యాతిని విశ్వ వ్యాప్తంగా తీసుకెళ్లిన గొప్ప మహనీయుడని, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాలు అభ్యున్నతికి వినలేని కృషి చేశారని అదేవిధంగా సినీ రంగంలో గొప్ప నటనతో ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జై రామ్, రంగారావు, కూన రాఘవేందర్ గౌడ్, మోటే శ్రీనివాస్ యాదవ్, గడ్డం రాజేందర్ రెడ్డి, రవి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీర సావర్కర్ పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి : ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు



**హైదరాబాద్ మే 28 సూర్య న్యూస్ :-** ప్రతి ఒక్కరూ దేశభక్తి, జాతీయ భావాన్ని కలిగి ఉండాలని భజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు అన్నారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు వినాయక్ దామోదర్ వీర్ సావర్కర్ 143వ జయంతిని గురువారం కాచిగూడలో భజరంగ్ సేన ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నేత వై.కృష్ణ తో కలిసి సావర్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లక్ష్మణ్ రావు మాట్లాడుతూ దేశంకోసం వీర సావర్కర్ చేసిన పోరాటం నేడు ప్రతి భారతీయుడు తెలుసుకోవాలన్నారు. ఆంగ్లేయులు విధించిన అతి భయంకరమైన శిక్షను అనుభవించి అండమాన్ జైల్లో క్రూరమైన శిక్షను విధించినా ఏమాత్రం వెరవ కుండా పోరాడిన మహనీయుడని కొనియాడారు. సావర్కర్ పుస్తకాలు, సినిమా చూడాలని ఆయన ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. వీర సావర్కర్ దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. సావర్కర్ పుస్తకాలు, సినిమా చూస్తే ఆయన త్యాగాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

## జూన్ 3న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

**హైదరాబాద్ మే 28 సూర్య న్యూస్ :-** గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ (జీహెచ్ జే ఎంఏసీ హెచ్ సీ) సర్వసభ్య సమావేశం జూన్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభ లో జరుగుతుందని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేందుకు ఇటీవల ప్రక్రియను ప్రారంభించిన సందర్భంలో జరుగుతున్న ఈ సర్వసభ్య సమావేశం అత్యంత కీలకమైనదని, సొసైటీ సభ్యులందరు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని వారు ఒక ప్రకటనలో కోరారు. జీహెచ్ఎంసీ పరిధిలో పని చేస్తున్న దాదాపు 1,350 మంది ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని, వీరిలో అత్యధిక శాతం జర్నలిస్టులు ఇరవై నుంచి 30 ఏళ్ళ సీనియారిటీ కలిగి ఉన్నారని పేర్కొన్నారు. 2008 నుంచి ఎంతోమంది సీనియర్ జర్నలిస్టులు సొసైటీలో సభ్యులుగా ఉండి ఇళ్ళస్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, కొంతమంది సీనియర్ పాత్రికేయులు ఇళ్ళస్థలాలు పొందకుండానే చనిపోయారని వారు తెలిపారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. జూన్ 3న జరిగే సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఇళ్ళస్థలాల సమస్య పై చర్చించి ఇళ్ళస్థలాల సాధనకు కార్యాచరణను రూపొందిస్తామని, ఇందుకోసం సీనియర్ సభ్యులతో కమిటీ వేస్తామని వారు పేర్కొన్నారు.

## త్యాగం, ప్రేమ, దాతృత్వం, మానవత్వానికి ప్రతీక బక్రీద్ : మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ మే 28 సూర్య న్యూస్ :-** బక్రీద్ పండుగ సందర్భంగా సూరారం కాలనీ రాజీవ్ గృహ కల్ప మస్జీద్ లో ప్రత్యేక ప్రార్థన లలో పాల్గొని శుభాకాంక్షలు తెల్పిన మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు త్యాగం, ప్రేమ, దాతృత్వం, మానవత్వానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఎంతో వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు అని అన్నారు. దేవుని ఆజ్ఞను శిరసావహించి తన ప్రాణప్రదమైన కుమారుడిని సైతం త్యాగం చేయడానికి సిద్ధపడిన ప్రవక్త ఇబ్రహీం నిబద్ధతకు ఈ పండుగ చిహ్నంగా నిలుస్తుంది. అలాగే ఖుర్బానీ ఇచ్చిన మాంసాన్ని పేదలు, బంధుమిత్రులకు పంచుకోవడం ఈ పండుగ లోని ముఖ్యమైన ఆచారం. ఈ పర్వదిన పండుగ సందర్భంగా దేశంలో, సమాజంలో సోదరభావాన్ని, శాంతిని పెంపొందెల ఉండాలాని ఆశిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమం లో ముస్లిం మత పెద్దలు, స్థానిక మస్జీద్ కమిటీ సభ్యులు, ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చల్లని పానీయం... నిశ్శబ్ద విషం! కూల్‌డ్రింక్ వెనుక దాగున్న చీకటి నిజాలు

వేసవి కాలం వచ్చిందంటే చాలు, భానుడి భగభగలకు గొంతు ఎండిపోతుంది. అటువంటి తరుణంలో చల్లగా, ముచ్చటగా మెరిసిపోయే ఒక కూల్‌డ్రింక్ సీసా చేతిలోకి వస్తే? ఆ పచ్చటి లేదా నల్లటి శీతల పానీయాన్ని గటగటా తాగుతుంటే, మొదటి గుక్కలోనే వచ్చే "ఆహ్!" అనే అనుభూతి ఒక స్వర్గానందాన్ని ఇస్తుంది. మనసుకు ఎంతో హాయిగా, ప్రశాంతంగా అనిపిస్తుంది. కానీ, రంగురంగుల లేబుళ్లతో, ఆకర్షణీయమైన ప్రకటనలతో మనల్ని మంత్రముగ్ధులను చేసే ఆ ఒక్క కూల్‌డ్రింక్ సీసా మన శరీరంలోకి ప్రవేశించిన క్షణం నుండి బయటకు వెళ్ళేంతవరకూ ఎలాంటి విధ్వంసాన్ని సృష్టిస్తుందో మీకు తెలుసా? గ్లామర్ ప్రపంచపు తెర వెనుక దాగున్న ఆ చీకటి యాత్రను, మన అంతర్గత అవయవాల రోదనను ఒక్కసారి లోతుగా పరిశీలిస్తే బహుశా మీరు మళ్ళీ ఆ రసాయనాల సీసాను అంత తేలిగ్గా చేతిలోకి తీసుకోరు.పరిశోధనలు తేల్చిన ఒక భయంకరమైన సత్యం ఏమిటంటే ఒక్క కూల్‌డ్రింక్ క్యాన్‌లో సుమారు 10 నుండి 12 చెంచాల చక్కెర ఉంటుంది. ఇది ఒక సగటు మనిషికి రోజంతా అవసరమయ్యే గరిష్ట చక్కెర మోతాదు కంటే రెట్టింపు కంటే ఎక్కువ!మీరు ఆ చల్లని పానీయాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు, మీ లోపల ఒక నిశ్శబ్ద తుఫాను మొదలవుతుంది. ఆ కాలక్రమ పట్టికను ఒకసారి చూద్దాం.0 10 నిమిషాలు (చక్కెర వరద) మీరు కూల్‌డ్రింక్ తాగిన వెంటనే, దాదాపు 150200 మిల్లీలీటర్ల ద్రవంలో కరిగిన 39 నుండి 42 గ్రాముల చక్కెర నేరుగా మీ రక్తంలోకి దూసుకుపోతుంది. సాధారణంగా ఇంత చక్కెరను ఒకేసారి తీసుకుంటే శరీరానికి వికారం కలిగి వాంతి రావాలి. కానీ కూల్‌డ్రింక్‌లో తెలివిగా కలిపిన ఫాస్ఫోరిక్ యాసిడ్ ఆ వికారాన్ని అణచివేస్తుంది. ఇది కంపెనీలు కనిపెట్టిన మైండ్ బ్లోయింగ్ కెమిస్ట్రీ కానీ మీ ప్రాణాల మీదికి తెచ్చే ముప్పు!10 20 నిమిషాలు (ఇన్సులిన్ హడావుడి) బ్లడ్ షుగర్ లెవెల్స్ రాకెట్ లాగా దూసుకుపోతాయి. కాలేయం అత్యంత అప్రమత్తమై, ఈ చక్కెర దాడిని తట్టుకోవడానికి ఇన్సులిన్ హార్మోన్‌ను విపరీతంగా విడుదల చేస్తుంది. ఆ అదనపు చక్కెరనంతా కొవ్వుగా మార్చే ప్రక్రియ ఇక్కడే మొదలవుతుంది.20 40 నిమిషాలు (కెఫీన్ తాకిడి) పానీయంలోని కెఫీన్ పూర్తిగా శరీరంలోకి శోషించుకోబడుతుంది. కంటి పాపలు విస్తరిస్తాయి, రక్తపోటు (బిపి) పెరుగుతుంది. మెదడులోని నిద్రమత్తు వదిలిపోయి, ఒక్కసారిగా ఏదో ఎనర్జీ వచ్చినట్లు భ్రమ కలుగుతుంది.40 60 నిమిషాలు (డోపమిన్ మాయాజాలం) మెదడులోని ఆనంద కేంద్రాలు సక్రియమవుతాయి. 'డోపమిన్' అనే హార్మోన్ విడుదల కావడం వల్ల మీకు ఒక రకమైన కిక్ లభిస్తుంది. నాకు ఇంకొక సీసా కావాలి అనిపించే వ్యసనపు వల ఇక్కడే పడుతుంది.60 నిమిషాల తర్వాత (క్రాష్ దశ) చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పాతాళానికి పడిపోతాయి. దాంతో విపరీతమైన అలసట, చికాకు, నీరసం ఆవహిస్తాయి. మళ్ళీ ఆ ఎనర్జీ కోసం మరో కూల్‌డ్రింక్ తాగాలనే క్రేవింగ్ మొదలవుతుంది. ఇదొక విషవలయం!ఈ పానీయాలు మన శరీరంలోని ముఖ్యమైన వ్యవస్థలను ఎలా గుల్ల చేస్తున్నాయో చూస్తే గుండె జారిపోక మానదు.కూల్‌డ్రింక్‌లో వాడే ప్రధాన స్వీటెనర్ 'హై-ఫ్రక్టోజ్ కార్న్ సిరప్' (ఎఖీజూ) నేరుగా కాలేయానికి చేరుతుంది. కాలేయం ఈ భారాన్ని మోయలేక, ఆ ఫ్రక్టోజ్‌ను ప్రమాదకరమైన ట్రైగ్లిజరైడ్స్ అనే కొవ్వు అణువులుగా మారుస్తుంది. ఫలితంగా, మద్యం తాగని వారిలో కూడా నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుంది. రోజూ కూల్‌డ్రింక్ తాగే వారికి ఈ కాలేయ వ్యాధి ముప్పు 55% పెరుగుతుందని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. శీతల పానీయాలను క్రమం తప్పకుండా తాగడం వల్ల మన అంతర్గత అవయవాలు తీవ్రమైన ముప్పుకు గురవుతాయి. తాజా వైద్య నివేదికల ప్రకారం, వీటిని రోజూ తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోయి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ (ఖీఫ్ఎ ాఆజవతీ) వచ్చే ప్రమాదం 55% పెరుగుతుంది. అంతేకాదు, రక్తంలో చక్కెర స్థాయిలు అస్తవ్యస్తమవడం వల్ల టైప్-2 మధుమేహం (ఱఖుఎవ్వం) బారిన పడే ముప్పు 26% హెచ్చుతక్కువగా పొంచి ఉంటుంది. అన్నిటికంటే భయంకరమైన విషయం ఏమిటంటే, ఈ రసాయన పానీయాలలోని విషపూరిత పదార్థాలు గుండె ఆరోగ్యాన్ని సైతం గుల్ల చేసి, గుండె జబ్బులు లేదా హార్ట్ ఎటాక్ (ఎముఖతీ చ్ఖుఎి) వచ్చే ప్రమాదాన్ని ఏకంగా 3 రెట్లు అధికం చేస్తాయి.మన శరీరంలోనే అత్యంత గట్టిదైన భాగం పంటిపై ఉండే ఎనమెల్ పొర. కూల్‌డ్రింక్‌లోని కార్బోనేషన్, ఫాస్ఫోరిక్ యాసిడ్, సిట్రిక్ యాసిడ్‌ల త్రయం ఈ ఎనమెల్‌ను క్షణాల్లో కరిగించివేస్తుంది. దీనిని డెంటల్ ఎరోజన్ అంటారు. ఒక్కసారి పోయిన ఎనమెల్ మళ్ళీ తిరిగి రాదు. దంత వైద్యుల హెచ్చరికల ప్రకారం రోజూ కూల్‌డ్రింక్ తాగే 30 ఏళ్ల యువతీ యువకుల పళ్ళు, 60 ఏళ్ల వృద్ధుల పళ్ళలా బలహీనంగా మారిపోతున్నాయి.ఇందులోని ఫాస్ఫోరిక్ యాసిడ్ మన రక్తంలో ఉండే అత్యంత విలువైన కాల్షియంను బంధించి, మూత్రం ద్వారా శరీరం నుండి బయటకు పంపేస్తుంది. దీనివల్ల ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. ముఖ్యంగా 12 నుండి 18 ఏళ్ల కిశోర ప్రాయంలో ఎముకల నిర్మాణం జరుగుతుంది. ఆ వయసులోనే ఈ పానీయాలు ఎక్కువగా తాగితే, 40 ఏళ్లు రాకముందే ఆస్టియోపోరోసిస్ (ఎముకలు గుల్లబారడం) బారిన పడటం ఖాయం. తల్లిదండ్రులూ జాగ్రత్త పిల్లలకు ఇచ్చేది ప్రేమ కాదు, శాపం!పిల్లల ఎదుగుదలపై కూల్‌డ్రింక్స్ నేరుగా గొడ్డలిపెట్టులా మారుతాయి. ఇందులోని అదనపు చక్కెర వారి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి, చిన్న వయసులోనే ఊబకాయం (ాఎవంఈఎ), బాల్య మధుమేహానికి కారణమవుతుంది. పదేళ్ల పిల్లాడి చేతికి కూల్‌డ్రింక్ సీసా ఇవ్వడం ప్రేమ కాదు, వారి భవిష్యత్తును అంధకారం చేయడమే.మెదడు, కూల్‌డ్రింక్‌లలోని కెఫీన్, షుగర్ కాంబినేషన్ మెదడును డ్రగ్స్ లాగా లొంగదీసుకుంటుంది. పరిశోధనల ప్రకారం, ఈ అలవాటును వదులుకోవడం నికోటిన్ (సిగరెట్ వ్యసనం) వదులుకోవడం అంత కష్టతరం. మరోవైపు, ఇందులోని సోడియం, ఆర్టిఫిషియల్ కలర్స్ వల్ల కిడ్నీలు రసాయనాలను వడకట్టలేక ఊపిరి సలపకుండా శ్రమిస్తాయి. వారానికి రెండు సార్ల కంటే ఎక్కువ కూల్‌డ్రింక్ తాగితే కిడ్నీ స్టోన్స్ వచ్చే అవకాశం 33% పెరుగుతుంది.చాలామంది స్మార్ట్ అనుకుని డైట్ కూల్‌డ్రింక్ లేదా జీరో షుగర్ వైపు మొగ్గు చూపుతారు. అయితే, ఇది ముందరి కాళ్ళకు బంధం లాంటిదే! ఇందులో చక్కెర బదులు వాడే అస్పార్టేమ్ ,సుక్రలోస్ వంటి కృత్రిమ స్వీటెనర్లు మన పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను (+బ్ వీఱఎతీశీఎఱశీఎవ) సర్వనాశనం చేస్తాయి. దీనివల్ల రోగనిరోధక శక్తి క్షీణించి, మానసిక ఆందోళన పెరగడమే కాకుండా, విచిత్రంగా ఊబకాయం ఇంకా పెరుగుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. డైట్ అనేది కేవలం మార్కెటింగ్ మాయాజాలం మాత్రమే!ఈ భయానక నిజాలు మిమ్మల్ని భయపెట్టడానికి కాదు, చైతన్యపరచడానికి మాత్రమే. అప్పుడప్పుడు ఏదో ఒక సరదా సందర్భంలో ఒక్క గుక్క తాగితే ముప్పేమీ ముంచుకురాదు, కానీ దీనిని దినచర్యగా మార్చుకుంటేనే ముప్పు. ఈ బహుళజాతి కంపెనీల రసాయన పానీయాలకు బదులుగా ప్రకృతి మనకు ప్రసాదించిన అమృతం లాంటి ప్రత్యామ్నాయాలు ఎన్నో ఉన్నాయి.

## సర్పంచ్ వెంకటరమణతో కలిసి ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు

### ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలని గ్రామస్తులకు సూచన

### తీవ్ర ఎండల్లో కార్మికులకు మజ్జిగ, శీతల పానీయాల పంపిణీ




**అశ్వారావుపేట ప్రతినిధి మే 28 సూర్య :-** అశ్వారావుపేట మండలం పరిధి రెడ్డిగూడెం పంచాయతీ లోని బండారిగుంపు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన విద్యా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఆమె కోరారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధి కూలీలతో కలిసి సర్పంచ్ వెంకటరమణ స్వయంగా తట్ట మోసి పని చేయడం అందరినీ ఆకట్టుకుంది. మండుతున్న ఎండల సమయంలో ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని, తరచూ నీరు తాగాలని ఆమె సూచించారు. అనంతరం కూలీలకు మజ్జిగ, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, కూలీలు పాల్గొన్నారు.

## దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



**కామారెడ్డి జిల్లా బ్యూరో మే 28 సూర్య న్యూస్** కామారెడ్డి జిల్లా సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ ఎం.రాజేష్ చంద్ర ఆదేశానుసారం పోలీస్ కళాబృందంచే అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల టోల్ ఫ్రీ నం 1930 ఓ టీ పి లు ఎవరికీ చెప్పవద్దని, అత్యవసర సమయంలో డైల్ 100 కు కాల్ చేయాలని, మహిళలకు రక్షణగా షి టీమ్ ఉంది షి టీమ్ టోల్ ఫ్రీ నం :872686094, అంతేకాకుండా రోడ్డు ప్రమాదాలు నివారణ కోసం హెల్మెట్ ధరించాలని, వేసవి కాలంలో దొంగ తనాలపై తగు జాగ్రతలు తీసుకువాలని, చిన్న పిల్లలు సెలవుల సందర్భంగా ఈతలకు పోయి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం చేయడమైనది. ఈ కార్యక్రమంలో కామారెడ్డి షీ టీమ్ సభ్యులు పీసీ సౌజన్య, పీసీ భూమయ్య, మానవ అక్రమ రవాణాపై పీసీ రాజేందర్ పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక, త్యాగానికి ప్రతి రూపంగా నిలిచే పండుగ బక్రీద్ :

### ప్యాక్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి మే 28 సూర్య న్యూస్ :-** పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద జరిగిన సామూహిక ప్రార్థనలో తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం సోదర, సోదరిమనులందరికీ బక్రీద్ పర్వదినం శుభాకాంక్షలు తెలియచేసిన ప్యాక్ చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్బంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ పవిత్ర బక్రీద్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు అని, అది దైవ భక్తికి, నిస్వార్థ త్యాగానికి నిదర్శనం అని, అల్లా పట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన అచంచలమైన విశ్వాసాన్ని స్మరించుకుంటూ ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు అని, బక్రీద్ పండుగను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని, చాలా పవిత్రమైన పండుగ అని, మత సామరస్యానికి ప్రతీక అని, త్యాగానికి ప్రతి రూపంగా నిలిచే ఈ పండుగ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థిస్తూ మత సామరస్యాన్ని ప్రతిభింబించేలా బక్రీద్ పండుగను భక్తి శ్రద్దల తో జరుపుకోవాలని కోరుకుంటూ ముస్లిం సోదర సోదరీమణులందరికి బక్రీద్ పర్వదిన శుబాకాంక్షలు తెలియచేయడం జరిగినది బక్రీద్ చాలా పవిత్రమైన పండుగ అని, మత సామరస్యానికి ప్రతీక అని, ముస్లిం సోదరులందరు .పండుగను చక్కటి వాతావరణం లోకుటంబ సభ్యుల మధ్య ఆనందాయకంగా, సంతోషకరంగా జరుపుకోవాలని కోరడం జరిగినది. బక్రీదు పండుగను విజయవంతంగా, ఆనందముగా జరుపుకోవాలని తెలియచేసారు . ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# త్రిలోక శోక హారిణి

## జూన్ 2 నుంచి 13 వరకు... యమునా నది పుష్కరాలు

మానవుల మనుగడలో నదులది ఎనలేని పాత్ర. ప్రపంచవ్యాప్తంగా అత్యున్నతమైన నాగరికతలు నదీ తీరాల్లోనే విలసిల్లాయి. అందుకే నదులను 'మాతృదేవతలు'గా భారతీయ సంస్కృతి ఆరాధించింది. మనుషులకు ప్రాణాధారమైన ఆ నదులకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి పుష్కరాలను నిర్వహించుకొనే సంప్రదాయాన్ని ఏర్పరచింది. దేశంలోని పన్నెండు ప్రధాన నదులను పుష్కర నదులుగా నిర్ణయించి, ఒక్కొక్క నదికీ పన్నెండేళ్ళకు ఒకసారి పుష్కరాలను నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. గురువు ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు... ఆ రాశికి సంబంధించిన నదికి పుష్కరాలు వస్తాయి. ఈ ఏడాది కర్కాటక రాశిలో గురు ప్రవేశం సందర్భంగా... యమునా నది పుష్కరాలు జరగబోతున్నాయి. సూర్యపుత్రి, యమ సోదరి: ప్రయాగ్‌రాజ్‌లో సంగమించే త్రివేణుల్లో (మూడు నదుల్లో) ఒకటైన యమునా నదికి పౌరాణికంగానూ ఎంతో ప్రశస్తి ఉంది. శ్రీకృష్ణుని లీలా విలాసాలకు కేంద్రంగా ఈ నదిని శ్రీమద్భాగవతం రమణీయంగా వర్ణించింది. యమునను సూర్యభగవానుడి కుమార్తెగా, యముడి సోదరిగా పురాణాలు పేర్కొన్నాయి. కాబట్టి యమునా స్నానం వల్ల సూర్యానుగ్రహం లభిస్తుందని, యమ బాధలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. పుష్కర దినాల్లో సంకల్ప పూర్వకంగా యమునలో స్నానం చేసి, పిండ ప్రదానాలు, తర్పణాలు , దాన ధర్మాలు చేస్తే పితృ దేవతలు తృప్తి చెందుతారని, అభీష్టాలు సిద్ధిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిశంకరులు తన 'యమునాష్టకం'లో ఈ నదిని 'త్రిలోక శోక హారిణి'గా అభివర్ణించారు. ఆ అష్టకాన్ని పఠిస్తూ స్నానం చేసి, అనంతరం జపాదులు ఆచరించడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయనేది పెద్దల మాట.




**పుష్కర స్నానం చేసే ప్రదేశాలు:** ఉత్తరాఖండ్‌లో యమునానది పుట్టిన చోటైన యమునోత్రిలో. గంగ, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలమైన (త్రివేణీ సంగమం) ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో. శ్రీకృష్ణుడు పుట్టిన ఊరైన మధురలో, ఆయన కంసుణ్ణి సంహరించిన తరువాత విశ్రమించాడని చెప్పే విశ్రామ్ ఘాట్‌లో. కేశి అనే రాక్షసుణ్ణి శ్రీకృష్ణుడు సంహరించిన ప్రదేశంగా ప్రసిద్ధి చెందిన బృందావనంలోని కేశీ ఘాట్ దగ్గర. డెహ్రాడూన్ జిల్లాలోని డాక్ పత్తర్ ఘాట్‌లో. ఢిల్లీలోని నిగంబోధ్ ఘాట్, వజీరాబాద్ తదితర ఘాట్లలో. ఆగ్రాలోని దసరా ఘాట్, కైలాస్ ఘాట్ తదితర ప్రదేశాల్లో.

# తెలుసుకోవాల్సింది అదే!

నేను ఎవరు? ఎక్కడినుంచి వచ్చాను? ఈ భూమి మీద మానవుడిగా ఎందుకు జన్మించాను? ఈ మానవ జన్మ పరమార్థం ఏమిటి? ఈ జన్మ ముగిసిన తరువాత నా పయనం ఎటువైపు?... సత్యాన్వేషకులు చాలామంది ఆలోచనల్లో ఈ ప్రశ్నలు తరచుగా మెదులుతూ ఉంటాయి. మనల్ని మనం తెలుసుకుంటే వీటికి సమాధానం లభిస్తుందంటూ ఎందరో మహానుభావులు మార్గాన్ని చూపించారు."నీవు కేవలం ఆత్మవు. శరీరానివో, బుద్ధివో, అహంకారానివో కాదు" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు స్పష్టంగా తెలియజేశాడు. ఆది శంకరులు "నీవు ఆత్మవు" అంటూ సంపూర్ణ వివరణ ఇచ్చారు. "దేవుణ్ణి తెలుసుకోవడానికి ముందు నిన్ను నువ్వు తెలుసుకో" అని గౌతమ బుద్ధుడు, మహావీరుడు కూడా చెప్పారు. ఆది గురువైన దత్తాత్రేయుడు పది అవతారాల ద్వారా 'నీవు ఎవరు?' అనేది తెలియజేసే ప్రయత్నం చేశాడు. ఏసు క్రీస్తు కూడా "నో దై సెల్ఫ్" అన్నాడు. "నిన్ను నువ్వు తెలుసుకోవాలి" అని దాని అర్థం. మహమ్మద్ ప్రవక్త, గురునానక్, కబీర్ దాసు, వేమన, రమణ మహర్షి... ఇలా అనేకమంది గురువులు ఇదే చెబుతూ వచ్చారు. మనలోని ఆత్మను ఎలా తెలుసుకోవాలో, పరమాత్ముడితో ఎలా అనుసంధానం కావాలో వివిధ మార్గాల ద్వారా బోధించి, మానవాళిని ముందుకు నడిపించడానికి పాటుపడ్డారు. కాగా. పై ప్రశ్నలకు సమాధానాన్ని తెలుసుకొనే ఒక విధానాన్ని సహజయోగ రూపంలో మానవాళికి శ్రీమాతాజీ నిర్మలాదేవి ప్రసాదించారు. దాని ద్వారా మనలో ఉన్న ఆత్మ, సూక్ష్మ శరీరాల ఉనికిని గుర్తించవచ్చు, అనుభూతిపరంగా వాటిని తెలుసుకోవచ్చు. లోకాన్ని సంక్షుభితం చేస్తున్న కల్లోలాల నుంచి, అశాంతి నుంచి వ్యాధుల నుంచి రక్షణ పొందడం కోసం... మనలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసుకోవాలి. ఆత్మను ప్రకాశవంతం చేసుకోవాలి. స్వీయ అనుభవం ద్వారా మనలోని సూక్ష్మ శరీరాన్ని అవగాహన చేసుకోవాలి. దీనికి దోహదపడే మహా యోగం... సహజయోగ. దాని అభ్యాసం ద్వారా మనల్ని మనం తెలుసుకొనే ప్రయత్నం చేస్తే... ఆత్మ సాక్షాత్కారం సిద్ధిస్తుంది. మన ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి.

# మూడు శక్తులు



దైవం ఎల్లప్పుడూ, అంతటా ఉంటాడు అనేది అన్ని విశ్వాసాలకు మూలాధారం. అయితే ఒక్కొక్క ధర్మానికి తనదైన ప్రత్యేక పంథా ఉంటుంది. క్రైస్తవ విశ్వాసం ప్రకారం దేవుడు ఎప్పుడూ మానవుల వెన్నంటే ఉంటాడు. అవసరమైనప్పుడు సంభాషిస్తాడు. చెప్పదలచినది చెప్పి, నడిపిస్తాడు. "నేను నీతోనే వస్తూ ఉంటాను. నిను విడువను, ఎడబాయను' అంటాడు. "గడ్డి ఎండిపోతుంది. పువ్వు వాడిపోతుంది. దేవుని వాక్యం నిత్యం మనతోనే ఉంటుంది" అని యెషయా చెబుతాడు. ఇది లోకానికి తండ్రి అయిన దేవునికి సంబంధించిన విషయం.క్రీస్తుకు 'ఇమ్మానుయేలు' అనే పేరు ఉంది. 'దేవుడు ఎల్లప్పుడూ మనకు తోడై ఉంటాడు' అని దాని అర్థం. భూమిపై జీవించి, మరణం తరువాత కూడా నలభై రోజులు తన వారితో ఉండి, మోక్షానికి పయనమవుతూ "ఇదిగో! నేను యుగ సమాప్తివరకూ ఎల్లకాలము మీతో ఉంటాను" అని వారితో చెప్పాడు ఏసుక్రీస్తు. "ఆకాశం, భూమి గతించిపోతాయి కానీ నా మాటలు ఎన్నడూ గతించవు" అని ప్రభువు చెప్పినట్టు ముగ్గురు సువార్తీకులు పేర్కొన్నారు. దైవానికి బైబిల్‌లో 'వాగ్రూపుడు' అనే ఇంకో పేరు ఉంది. అంటే మాట రూపంలో ఆయన ఉన్నాడు. ఇవన్నీ గమనించినప్పుడు... 'దేవుడు మనిషిని ఒంటరిగా విడిచి పోలేదు. వెంటే ఉండి నడిపించాడు, నడిపిస్తున్నాడు' అని బైబిల్ గ్రంథాన్ని బట్టి, దాని వ్యాఖ్యానాలను బట్టి స్పష్టమవుతోంది. ఈ సృష్టికి రూపకల్పన చేసిన దేవుడు... ఆ సృష్టి భ్రష్టమైపోతున్న దశలో... తన కుమారుడు క్రీస్తును ఈ లోకానికి పంపించాడు. క్రీస్తు లోకులకు బోధలు చేశాడు. అందరికోసం మరణించాడు. మరణం నుంచి తిరిగి లేచాడు. తిరిగి మోక్షానికి వెళ్ళాడు. మరి ఆ తరువాత... ఈ లోకానికి దిశా నిర్దేశం చేసేవారు ఎవరు? "దైవం మీకు తోడు వస్తాడు. మిమ్మల్ని నడిపిస్తాడు" అని ప్రభువు చెప్పిన ప్రకారమే... అగ్ని శిఖలతో పవిత్రాత్మ వచ్చి, శిష్యుల తలలపై చేరింది. ఆ పవిత్రాత్మే ఈ లోకాన్ని నడిపిస్తోందనేది విశ్వాసుల నమ్మకం. సమస్త లోకానికి తండ్రి అయిన దైవం, ఆయన ప్రియ పుత్రుడైన క్రీస్తు, పవిత్రాత్మ... విడివిడిగా ఉంటూనే, ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉండే మూడు శక్తులు. క్రీస్తు మళ్ళీ వస్తాడనీ, అప్పటివరకూ ఈ పవిత్రాత్మ తన బోధనను శిష్యులద్వారా కొనసాగిస్తూ ఉంటుందని క్రైస్తవుల విశ్వాసం.

# లోకాభిరామం శ్రీరామం

శ్రీమహావిష్ణువు అవతారాల్లో అత్యంత విశిష్టమైనది శ్రీరామావతారం. ఆయన ఆదికావ్యమైన రామాయణ కథానాయకుడు. ధర్మనిష్ట, సత్యసంధత అనే ఆదర్శాలకు ప్రతిరూపం. రామాలయం లేని గ్రామంలో ఒక్క రాత్రి కూడా నిద్రించకూడదన్నారు పూర్వులు. సామాన్యంగా ఆలయాల్లో శ్రీరాముడు విడిగా కనిపించడం అరుదు. ధర్మపత్ని అయిన సీత, సోదరుడు లక్ష్మణుడు, సేవకుడైన హనుమంతుడు, కొన్నిసార్లు మరో ఇద్దరు సోదరులు భరత, శత్రుఘ్నులతో కలిసి దర్శనమిస్తాడు. శ్రీరాముని రూపాలు మూడు విధాలుగా ఉంటాయి. అవి: స్థిత (నిలబడిన) రూపం. ఆసీన (కూర్చున్న) రూపం. శయన (పవళించిన) రూపం. స్థితరూపం: 'పాంచరాత్రాగమం', 'పాద్మ సంహిత' ప్రకారం నిలబడిన శ్రీరాముడు మూడు వంపులున్న శ్యామల వర్ణ దేహంతో, రెండు చేతులతో ఉంటాడు. కిరీటం, శ్రీవత్సం లాంటి అలంకారాలతో, ప్రసన్నవదనంతో, కుడిచేతిలో బాణాన్ని, ఎడమ చేతిలో ధనుస్సును ధరించి ఉంటాడు. కొన్ని ఆలయాలలో నాలుగు చేతులతో... కుడి పరహస్తంలో చక్రం, ఎడమ పరహస్తంలో శంఖం ధరించి ఉంటాడు. శ్రీరాముని దివ్యరూపం 33 శుభ లక్షణాలను కలిగి ఉంటుంది. శిల్ప ఆగమ శాస్త్రాలను అనుసరించి శ్రీరాముని ప్రతిమ మధ్యమ దశతాళమానం ప్రకారం 120 అంగుళాలకన్నా ఎక్కువ ఎత్తులో ఉండకూడదు. ఆ మూర్తి త్రిభంగిలో ఉన్న స్థానక మూర్తి. ఎర్రని వస్త్రాలు ధరించిన, నల్లని రూపం కలిగిన మూర్తి. రామునికి కుడివైపున నవార్ధ (తొమ్మిదిన్నర) తాళమానంలో చేసిన సీతా ప్రతిమ ఉండాలి. సీతాదేవి సమభంగిలో ఉండి, రాముని భుజాల ఎత్తు వరకూ ఉండాలి. రాముని తల మీద కిరీట మకుటం, సీత తలమీద కరండ మకుటం ఉండాలి. సీతాదేవి తన ఎడమ చేతిలో నీలోత్పలాన్ని ధరించి, కుడి చేతిని జారవిడిచినట్టు చూపించాలి. రామునికి ఎడమవైపున... 116 అంగుళాలకు మించని లక్ష్మణుని ప్రతిమ ఉండాలి. లక్ష్మణుడు రాముని భుజాల వరకు లేదా చెవుల వరకు... పసుపు పచ్చని మేని ఛాయతో, అన్ని విధాలా రాముణ్ణి పోలి, ధనుర్బాణాలు ధరించి ఉంటాడు. రామునికి ఎదురుగా... కాస్త కుడివైపున, 84 అంగుళాలకు మించని హనుమంతుడు ఉంటాడు. ఒక చేతిని నోటి మీద, వేరొక చేతిని జారవిడిచినట్టు చూపాలి. 'విష్ణుధర్మోత్తర పురాణం' ప్రకారం భరత, శత్రుఘ్నుల ప్రతిమలు కూడా ఉండాలి. ఆసీన రూపం: రెండు చేతులు కలిగిన రాముని విగ్రహం ఆసీన భంగిమలో ఉన్నప్పుడు... ధనుర్బాణాలతో ఉండదు. ఈ రూపంలో శ్రీరాముడు కుడి, ఎడమ చేతులు అభయ, వరద ముద్రలతో ఉంటాయి. రామునికి ఎడమవైపున సీతాదేవి సుఖాసీనురాలై ఉంటుంది. ఎడమవైపున లక్ష్మణుడు అంజలీ బద్ధుడై ఉంటాడు. భద్రాచల దివ్య క్షేత్రంలో శ్రీవైకుంఠ రామచంద్రమూర్తి ఆసీన రూపంలో దర్శనమిస్తాడు. కుంభకోణంలోని రామర్ కోయిల్‌లో కూడా కూర్చున్న రాముణ్ణి దర్శించుకోవచ్చు. శయనరూపం: శ్రీరాముడు శయన భంగిమలో ఉన్నప్పుడు... ఆయన కిరీటం దగ్గర సీతాదేవి సుఖాసీన స్థితిలో ఉంటుంది. లక్ష్మణుడు తదితరులు అంజలీబద్ధులైనట్టు, హనుమంతుడు యానాసనంలో లేదా శరాసనంలో ఉన్నట్టు రూపొందించాలని శాస్త్రాలు పేర్కొన్నాయి. తిరువల్లూరులోని శ్రీవీరరాఘవస్వామిని, కుంభకోణంలోని శ్రీసారంగపాణి పెరుమాళ్‌ను శయనించి ఉన్న శ్రీరాముని ప్రతిమలకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. కేవల శ్రీరాముడు: 'పాద్మసంహిత' ప్రకారం... రాముని విగ్రహం ఒక్కటే ప్రతిష్ఠించాల్సి వస్తే.. స్వామిని గర్భగుడి మధ్యభాగమైన బ్రహ్మభాగంలో ప్రతిష్ఠించాలి. స్వామి నిలబడి ఉంటే...ధనస్సును, బాణాలను పట్టుకొని ఉన్నట్టు రూపొందించాలి. అయోధ్యలో బాలరాముణ్ణి ఆ విధంగానే రూపొందించి, ప్రతిష్ఠించారు.



# మైక్రో డ్రామా... భారత్ లో బలపడుతున్న ట్రెండ్ ఇదే!

**భారత్‌లో దూసుకొస్తున్న కొత్త వినోద రూపం 'మైక్రో డ్రామాలు'**

**జియోస్టార్, అమెజాన్ వంటి ఓటీటీలు ఈ ఫార్మాట్‌ను అందిస్తున్నాయి**

**తక్కువ నిడివితో మొబైల్ యూజర్లను ఆకట్టుకోవడమే లక్ష్యం**

**2028 నాటికి రూ. 23 బిలియన్ల మార్కెట్‌గా ఎదుగుతుందని అంచనా**

భారత వినోద రంగంలో సరికొత్త ట్రెండ్ మొదలైంది. ప్రేక్షకుల దృష్టిని ఆకట్టుకోవడానికి స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు "మైక్రో డ్రామా"ల పేరుతో ఒక కొత్త ఫార్మాట్‌ను దూకుడుగా ప్రవేశపెడుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ తెరలకు అతుక్కుపోతున్న నేటి తరాన్ని లక్ష్యంగా చేసుకుని, ఒకటి నుంచి మూడు నిమిషాల నిడివితో ఉండే చిన్న చిన్న ఎపిసోడ్లతో ఈ మినీ సీరియళ్లను రూపొందిస్తున్నాయి. ఈ మార్పులో భాగంగా, జియోస్టార్ తన జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌లో 'తడ్కా' పేరుతో ఏప్రిల్ 2026లోనే 100కు పైగా మైక్రో డ్రామా టైటిళ్లను అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు అమెజాన్ కూడా ఎంఎక్స్ ప్లేయర్‌లో 'ఫటాఫట్' పేరుతో ఇలాంటి ఫార్మాట్‌ను ప్రవేశపెట్టింది. వీటితో పాటు కుకు టీవీ, స్టోరీ టీవీ వంటి ప్రత్యేక యాప్‌లు కూడా వేగంగా ఆదరణ పొందుతున్నాయి. భారతీయులు 2025లో తమ ఫోన్లపై 1.2 ట్రిలియన్ గంటలు గడిపారన్న అంచనాలే ఈ కొత్త ట్రెండ్‌కు ప్రధాన కారణం. దేశంలో స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల సంఖ్య 584 మిలియన్లకు చేరగా, 2028 నాటికి ఇది 670 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. ప్రయాణాల్లో, చిన్న విరామ సమయాల్లో రీల్స్, షార్ట్స్ చూసే అలవాటు ఉన్న ప్రేక్షకులను ఆకర్షించేందుకు ఈ మైక్రో డ్రామాలు దోహదపడతాయి. ఈ మైక్రో డ్రామాలను కేవలం వినోదం కోసమే కాకుండా, తక్కువ ఖర్చుతో కొత్త కథలను, పాత్రలను పరీక్షించడానికి ఓటీటీలు ఒక 'ప్రయోగశాల'గా చూస్తున్నాయి. వీటిలో విజయవంతమైన వాటిని పూర్తిస్థాయి సిరీస్‌లుగా మార్చే అవకాశం ఉంది. ఈ రంగం 2028 నాటికి సుమారు 275 మిలియన్ డాలర్ల ఆదాయాన్ని సృష్టించగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద, రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ వంటి వాటితో పోటీ పడుతూ, ప్రేక్షకులను తమ ప్లాట్‌ఫామ్‌లలోనే ఉంచడానికి స్ట్రీమింగ్ సంస్థలు వేస్తున్న సరికొత్త ఎత్తుగడ ఈ మైక్రో డ్రామాలు.



# 'సర్'కు సరే...!

ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఎన్నికల సంఘానికి కొత్తశక్తిని ఇస్తుంది. పదహారు రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడోవిడత 'సర్'కు ఉపక్రమిస్తున్న తరుణంలో, జాబితాల ప్రక్షాళన విషయంలో ఎన్నికల సంఘానికి ఈ తీర్పు సర్వాధికారాలనూ దఖలుపరిచింది. ఈ ప్రక్రియను సమర్థిస్తూ వస్తున్న భారతీయ జనతాపార్టీకి ఇది సంతోషాన్నిస్తే, వ్యతిరేకించి వీధిపోరాటాలు చేసిన విపక్షాలకు పెద్ద ఎదురుదెబ్బ. బిహార్‌లో చేపట్టిన 'సర్' భేషుగ్గా ఉందని కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో ఇక దేశవ్యాప్తంగా ఆ పథకాన్ని అమలు చేయడంలో ఈసీకి ఏ అడ్డంకులూ ఉండబోవు. 'సర్' రాజ్యాంగబద్ధం, దానిని నిర్వహించే హక్కు, అధికారం ఈసీకి ఉన్నాయి, అది ఏ చట్టాలనూ అతిక్రమించలేదు, రాష్ట్రాల్లో 'సర్' నిర్వహణ ఆవశ్యకత ఉందన్న ఈసీ వాదన సమర్థనీయం, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు జరగాలన్న రాజ్యాంగ ఆదేశాలను, ఆకాంక్షలను సర్ నెరవేరుస్తుంది అంటూ చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్జీ ధర్మాసనం తమ నూటపాతిక పేజీల తీర్పులో నిర్ధారించింది. ఏటా జరిగే ఓటర్ జాబితా సవరణకంటే సర్ భిన్నంగా ఉన్నంతమాత్రాన దానిని వద్దనలేమని, మొదట్లో ఎక్కువమంది ఓటర్లను తొలగించినట్టుగా సర్ కనిపిస్తుంది కానీ, తగిన రక్షణచర్యలతో దీనిని రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చునని కోర్టు వ్యాఖ్యానించింది. ఆధార్, ఓటరు కార్డు తిరస్కరణ సహా అర్హత పత్రాల నిర్ణయంలో ఈసీ అధికారాలను కోర్టు పూర్తిగా సమర్థించడం విశేషం. ఎన్నికల సంఘానికి ఏవో కొన్ని నామమాత్రపు సలహాలు, సూచనలు మినహాయిస్తే, సుప్రీంకోర్టు ఈ తీర్పుతో సర్‌కు ప్రాథమికంగా చట్టబద్ధత కల్పించింది. ఓటరు జాబితాలో పేరు లేనంతమాత్రాన పౌరసత్వం కోల్పోయినట్టు కాదని కూడా ఓ భరోసా ఇచ్చింది. దేశ పౌరులు కాదన్న అనుమానంతో రెండుదశాబ్దాల నాటి ఆ జాబితాలనుంచి తొలగించిన వ్యక్తులపేర్లను నాలుగువారాల్లోగా పౌరసత్వాన్ని నిర్ధారించే యంత్రాంగానికి పంపించాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. ఓటరు జాబితాలో తీసివేతలు, చేరికలను నిర్ణయించే పరిధి మాత్రమే ఎన్నికల సంఘానిది కానీ, పౌరసత్వాన్ని మాత్రం అది నిర్ధారించలేదన్నది దీని సారాంశం. 'సర్' పేరిట పెరటిదోవన 'ఎన్‌ఆర్‌సి' అమలు అవుతోందన్న విమర్శలు, అనుమానాల నేపథ్యంలో కోర్టు ఈ జాగ్రత్త తీసుకున్నట్టు ఉంది. మరోవిధంగా చెప్పుకోవాలంటే, తనకు నచ్చినవాటిని మాత్రమే అర్హతపత్రాలుగా నిర్ణయించి, వాటి ఆధారంగా ఈ దేశ పౌరులు కాదన్న అనుమానంతో లక్షలాదిఓట్లను తొలగించడం వరకూ ఎన్నికల సంఘం ప్రక్రియ సరైనదే. కానీ, పౌరసత్వ నిర్ధారణ అధికారం మాత్రం దానికి లేదు కనుక, ఆ పని వేరే చోట జరిగి, ఒకవేళ సదరు అథారిటీ వీరిలో కొందరు ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించిన పక్షంలో, ఆ పేర్లు తిరిగి జాబితాలో చేరుతాయన్నమాట. వినడానికి ఎంతో బాగున్న ఈ ఆ దేశం ఆచరణలో కాగితాలమీద ఎంతకాలం మిగిలిపోతుందో చూడాలి.స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్యానికి పునాది వంటి మాటలు వినడానికి ఎంతో బాగుంటాయి. కానీ, ఆచరణలో ఓటరు జాబితాలనుంచి లక్షలసంఖ్యలో మాయమైపోయిన పేర్లు ఎవరివో, ఎందుకో అందరికీ తెలుసు. బిహార్‌లో నలభై లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 90లక్షల ఓట్లు ఒక్కవేటున తొలగిపోయి, ఆ తరువాత సుప్రీంకోర్టు అడపాదడపా ఇచ్చిన సూచనల మేరకు నామమాత్రంగా సాగిన ట్రిబ్యునల్స్ తరహా పరిష్కారాలతో వందల సంఖ్యలో మాత్రమే పేర్లు తిరిగి చేరిన విషయం తెలిసిందే. ముఖ్యంగా, బిహార్, బెంగాల్‌లో విపక్షపార్టీలకు ఓటు బ్యాంకుగా ఉన్న ముస్లిం ఓటర్ల ఏరివేతే లక్ష్యంగా ఇది సాగిందన్నది ప్రధానమైన విమర్శ. కనీసం రెండుదశాబ్దాలుగా ఏ జాబితాలైతే అనేక రాష్ట్రాల్లో పాలకులను, కేంద్రంలో మూడుసార్లు ఇదే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నాయో, వాటికి మకిల వదిలించి ప్రక్షాళించే పేరిట లక్షలమంది నిరక్షరాస్యులు, నిరుపేదలను ఓటుహక్కుకు దూరం చేయడం గురించి కోర్టు సహజంగానే మాట్లాడలేదు. 'సర్' రాజ్యాంగబద్ధత గురించి కోర్టు ఏమి చెప్పబోతున్నదో దానికి వ్యతిరేకంగా పిటిషన్లు వేసిన వారికి కూడా అనుమానం ఉండివుండదు. కానీ, ఆచరణలో అత్యంత హడావుడిగా, అన్యాయంగా సాగిన ఈ ప్రక్రియ వెనుక ఉన్న దురుద్దేశాల గురించే వారి బాధంతా.




EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD - 500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD -500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO: 8985586689, EMAIL: suryavelugutelanganadesk@gmail.com, Web SITE: www.suryavelugu.com